PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 90, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 20 - మే - 2026 , వెల రూ.5/-



## జూన్ 15 నుంచి ఏపీలో ఎస్ఐఆర్ జరుగుతుందన్న సజ్జల

- ఏపీలో 'ఎస్ఐఆర్'.. అలర్ట్ గా ఉండాలంటూ పార్టీ శ్రేణులకు సజ్జల ఆదేశం
- అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచన
- సమర్థవంతంగా పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని వెల్లడి

# సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే ప్రభుత్వ ధ్యేయం

## ప్రజల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచన

- 40 వేల మందితో చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్.. సీఎంతో మాట్లాడడంపై ఉద్యోగుల హర్షం
- అవినీతి రహిత పారదర్శక పాలన అందించాలి
- వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి



అమరావతి: సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఒకే బృందంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి మిగతా..2లో

## అదానీకి భారీ ఊరట.. అమెరికాలో కేసులన్నీ క్లోజ్

గౌతమ్ అదానీ, సాగర్ అదానీలపై కేసులు రద్దు



- మళ్లీ కేసే వేయడానికి వీల్లేకుండా కొట్టివేత
- ఆధారాలు, యూఎస్‌కు సంబంధాలు లేవని వెల్లడి
- సివిల్ కేసుల కోసం 18 మిలియన్ డాలర్లు చెల్లించిన అదానీలు



## ఏపీలో 16,000 ఇ-సైకిళ్లు..

### ఉద్యమంగా మార్చాలన్న సీఎం చంద్రబాబు

- ఏపీలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని ఉద్యమంగా మార్చే యోచన
- స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలకు 16,000 ఇ-సైకిళ్లు
- ఈవీ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- సులువైన రుణాల కోసం ప్రత్యేక ఎస్పీవీ ఏర్పాటుకు నిర్ణయం
- ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తామన్న ప్రభుత్వం

# ఈ నెల 28 నుంచే అమలుకు సన్నాహాలు

## 3 రకాలుగా సాగు భూముల విలువ సవరణ!

- ఎకరా ప్రభుత్వ విలువ రూ.1.75 లక్షల నుంచి రూ.2.75 లక్షలకు
- ఓఆర్ఆర్ లోపల కనిష్ఠంగా రూ.15 లక్షలు
- అపార్టుమెంట్లలో చదరపు అడుగు రూ.6 వేలు



హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూముల ప్రభుత్వ విలువను మూడు రకాలుగా సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాలు, జాతీయ, ప్రధాన రహదారులు, మండల కేంద్రాలు, పట్టణాలకు సమీపంలోని భూముల విలువను సవరించనున్నారు. బాహ్య వలయ రహదారి(ఓఆర్ఆర్) లోపల ప్రాంతాల్లో బహిరంగ ధరలకు, మార్కెట్ విలువకు అంతరం భారీగా ఉంది. దీంతో స్థానిక పరిస్థితులను బట్టి మార్కెట్ విలువను సవరించాలని అంచనాకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వచ్చినట్లు తెలిసింది. మొత్తంగా సాగు, సాగేతర, స్థిరాస్తుల విలువ 50% వరకు సవరించనున్నట్లు తెలిసింది. ఈ నెల 28 నుంచి కొత్త ధరలను అమల్లోకి తీసుకురావాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించినట్లు సమాచారం. కొద్దిరోజులుగా ఈ విషయంపై శాఖ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు యంత్రాంగంతో కసరత్తు చేస్తున్నారు. సోమవారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలపై ఒకేసారి ఎక్కువ మొత్తం భారంపడకుండా మిగతా..2లో



## నెలరోజుల పాటు తెలంగాణ రక్షణ సేన జెండా పండగ

పార్టీ జెండా గద్దె నమూనాను ఆవిష్కరిస్తున్న కవిత

ఈ నెల 20 నుంచి జూన్ 20 వరకు నెలరోజుల పాటు జెండా పండగ నిర్వహించాలి మిగతా..2లో




## ప్రజలకు బిగ్ అలర్ట్

- 45 డిగ్రీ సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు
- ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలులు తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి
- వడగాడ్పులు ఆరోగ్య సమస్యలను కలిగించే అవకాశమున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న వారం రోజులపాటు గరిష్ట

## కాలిఫోర్నియా మసీదు వద్ద దారుణం.. ముగ్గురిని చంపి, ఆత్మహత్య చేసుకున్న టీనేజర్లు



కాలిఫోర్నియాలోని ఇస్లామిక్ సెంటర్ వద్ద కాల్పులు

- సెక్యూరిటీ గార్డు సహా ముగ్గురు మృతి
- దాడికి పాల్పడిన ఇద్దరు టీనేజర్లు ఆత్మహత్య
- విద్వేషపూరిత దాడిగా పోలీసుల అనుమానం

## విశాఖను ఏఐ, డేటా సెంటర్ల హబ్‌గా అభివృద్ధి చేసే ప్రణాళిక

### డేటా సెంటర్ల చుట్టూ పూర్తిస్థాయి తయారీ ఎకోసిస్టమ్ నిర్మాణం

- న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఏపీని నమ్మకమైన భాగస్వామిగా నిలుపుతాం: ఢిల్లీలో మంత్రి లోకేష్
- ఢిల్లీలో 'యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా" సదస్సు
- పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం
- అమెరికా-భారత్ అణుశక్తి సహకారంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందన్న లోకేష్




అమరావతి: భవిష్యత్ అణు ఇంధన (న్యూక్లియర్ ఎనర్జీ) ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌ను నమ్మకమైన ప్రపంచ భాగస్వామిగా నిలబెట్టడమే తమ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్న మిగతా..2లో

## మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల రూపు రేఖలు మార్చడమే మా లక్ష్యం

### నిర్దేశిత లక్ష్యంలోగా మావోయిస్టులను నిర్మూలించాం

- మావోయిస్టులను నిర్మూలించడంలో తెలంగాణ పోలీస్ అధికారులు కీలకంగా వ్యవహరించారు
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెల్లడి
- యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో పాల్గొన్న అధికారులకు సత్కారం



హైదరాబాద్: రాబోయే ఐదేళ్లలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల రూపురేఖలు మార్చడం తమ తదుపరి లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. నిర్దేశిత లక్ష్యం 2026 మార్చి 31లోగా దేశంలో మిగతా..2లో

## వాహనదారులకు షాక్.. మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

### సగటున లీటర్‌పై 90 పైసలు పెంపు



- అంతర్జాతీయ మార్కెట్లో 100 డాలర్లు దాటిన బ్రెంట్ క్రూడ్
- హైదరాబాద్‌లో 99 పైసలు పెరిగి రూ.111.88కి చేరిన పెట్రోల్
- ఢిల్లీలో రూ.98.64, ముంబయిలో రూ.107.59కి చేరిన పెట్రోల్

'అమ్మ' క్యాంటీన్లను ఆధునికీకరించాలని

## సీఎం విజయ్ ఆదేశాలు

- క్యాంటీన్ల మౌలిక సదుపాయాలను, ఆహార పదార్థాల నాణ్యతను పెంచాలని ఆదేశం
- ఆహార నాణ్యత, రుచి ఆశించిన స్థాయిలో ఉండటం లేదని తన దృష్టికి వచ్చినట్లు వెల్లడి
- ప్రజలకు రుచికరమైన భోజనం అందేలా చూడాలన్న విజయ్



తమిళనాడు : అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన 'అమ్మ క్యాంటీన్ల'ను రాష్ట్రవ్యాప్తంగా ఆధునికీకరించాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సోమవారం ఆదేశించారు. క్యాంటీన్ల మౌలిక సదుపాయాలను, ఆహార పదార్థాల మిగతా..2లో

# అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



పులిచెర్ల, మే 19,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ వాణిశ్రీదేవి తెలిపారు.పులిచెర్ల మండలం కల్లూరు-3 కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ) పోస్టు ఖాళీగా ఉండగా, చిగురుమాకులపల్లి (బీసీ-ఏ), దిగువ బెస్తపల్లి (బీసీ-ఏ), కమలాపురం (ఎస్టీ), ఊడగమాకులపల్లి (బీసీ-ఈ) కేంద్రాల్లో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై, వివాహితులు మరియు స్థానికులై ఉండాలని పేర్కొన్నారు. 01-07-2026 నాటికి 21 సంవత్సరాలు పూర్తి చేసి, 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలి. విద్యార్హత, కులం, నేటివిటీ, ఆదాయం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు ధ్రువపత్రాలతో పాటు రెండు ఫోటోలు జతచేసి ఈ నెల 20 నుంచి 28వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పులిచెర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు

# బాలికల భద్రతకు చట్టాలే రక్షణ కవచం



పులిచెర్ల, మే 19,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా,పులిచెర్ల మండలం, వెంకటదాసరిపల్లి సచివాలయంలో మంగళవారం పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో "కిశోరి వికాసం" వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోరి బాలికలకు వివిధ చట్టాలు, హక్కులు మరియు వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పులిచెర్ల ప్రాజెక్టు సీడీపీవో వాణిశ్రీదేవి మాట్లాడుతూ బాలికల రక్షణ కోసం అమల్లో ఉన్న పోక్సో చట్టం, బాల్య వివాహ నిషేధ చట్టం, గృహహింస నిరోధక చట్టాల గురించి వివరించారు. బాలికలు 18 సంవత్సరాలు పూర్తి అయిన తరువాత, బాలురు 21 సంవత్సరాలు నిండిన తరువాత మాత్రమే వివాహం చేసుకోవాలని సూచించారు. సమాజంలో పిల్లలపై జరుగుతున్న వేధింపులు, దుర్వినియోగ ఘటనలపై అప్రమత్తంగా ఉండాలని, అలాంటి పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. అదేవిధంగా విద్యాహక్కు చట్టం ప్రాముఖ్యతను వివరిస్తూ, 14 సంవత్సరాల లోపు ప్రతి బాలబాలిక విద్యను కొనసాగించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. విద్యతో పాటు సమతుల్య ఆహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు విజయలక్ష్మి, సుహాసిని, మహిళా పోలీసు చరిత, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు సుజాత, సంపూర్ణ, శ్రీలత, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# పిసా చట్టాలపై గిరిజనులకు పూర్తి అవగాహన అవసరం

### రింతాడ పంచాయతీలో పిసా గ్రామసభ అవగాహన కార్యక్రమం



గూడెంకొత్తవీధి,నేటి శుభోదయ,మే 19:మండలంలోని రింతాడ పంచాయతీ సచివాలయం-2లో సోమవారం పిసా గ్రామసభ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పిసా పోరం కార్యదర్శి సభ్యుడు గబులంగి గణేష్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అమలవుతున్న పిసా చట్టాలు, గ్రామసభ హక్కులు, భూ బదలి చట్టాలపై ప్రతి గిరిజనుడు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామసభకు ఉన్న అధికారాలు, గిరిజన భూముల పరిరక్షణ, అడవి సంపద వినియోగం, స్థానిక వనరులపై గ్రామసభ నిర్ణయాధికారం వంటి అంశాలను వివరించారు.షెడ్యూల్ ప్రాంతాల్లో గ్రామసభకు ప్రత్యేక హక్కులు ఉన్నాయని, గ్రామ ప్రజల అనుమతి లేకుండా భూముల బదిలీలు, గనుల అనుమతులు, పెద్ద ప్రాజెక్టులు చేపట్టరాదని తెలిపారు. గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మద్యం నియంత్రణ, సహజ వనరుల పరిరక్షణలో గ్రామసభ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అలాగే గిరిజనుల సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలను రక్షించేందుకు పిసా చట్టం ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పిసా ఉపాధ్యక్షులు సాగిన భీమేష్ పడాల్, ఉపాధ్యక్షుడు సిద్దు ఇమ్మానుయేల్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, జనసేన నాయకుడు కోటి బాబు, స్థానిక నాయకుడు జోగి దొర తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్ పై జరిగిన దాడికి నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

### టీడీపీ నాయకులు దుష్ప్రచారం మానుకోవాలి

### ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు




పాడేరు,నేటి శుభోదయ,మే 19:పాస్టర్ అభినయ్‌పై జీకే వీధిలో జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని పాడేరు శాసన సభ్యుడు, అల్లూరి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. ఈ ఘటనను తమ పార్టీపై, తనపై మోపుతూ కొందరు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఉండే ఆదివాసీ ప్రాంతాల్లో ఇలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఈ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పాస్టర్ అభినయ్ ఎవరో కూడా తనకు తెలియదని, ఈ ఘటన సోషల్ మీడియా మరియు పత్రికల్లో వచ్చిన తర్వాతే విషయం తెలిసిందన్నారు.దాడి చేసిన అసలు నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, ఘటనను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరియు స్థానిక ఎమ్మెల్యేకి ఆపాదిస్తూ దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడ చిన్న సంఘటన జరిగినా దానిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై నెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.జీకే వీధిలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిజంగా దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

అలాగే సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# "వైద్యం కోసం సొంత నిధులు, రూ.20వేలు సహాయం అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి"



తాడేపల్లిగూడెం మే 19 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)::: ఇటీవల ప్రమాదానికి గురయ్యి, తీవ్రంగా గాయపడిన,గూడెం మండలం పుల్లాయ గూడెం గ్రామానికి చెందిన తానంకి శ్రీనివాస్ కు శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సొంత నిధులు 20వేల రూపాయలను మెరుగైన చికిత్స నిమిత్తం అందజేశారు.స్థానిక జనసేన కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అనే భావంతో శక్తి మేరకు పేదలకు సహకారం అందిస్తున్నామని అన్నారు. జనసేన అధ్యక్షులు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు.ఆపదలో ఆదుకున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు తానంకి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడప ప్రసాద్, అడ్డగర్ల,సురేష్, పాలూరి వెంకటేశ్వరరావు, మైలవరపు గోపాలకృష్ణ, మద్దాల మణికుమార్, మైలవరపు రాజేంద్రప్రసాద్, నల్లగంచి రాంబాబు,బేతినగిరి, రామ లక్ష్మణ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# టిప్పర్ల పై కవర్స్ (టార్పాల్స్) లేకపోవడంపై ఎమ్మెల్యే 'బత్తుల' తీవ్ర ఆగ్రహం

### - పరిమితికి మించి హై స్పీడ్ , ఓవర్ లోడ్ తో వెళుతున్న పలు వాహనాలను నేరుగా ఆపి తనిఖీలు.. - టిప్పర్ల నుండి రోడ్లపై ఇసుక, మట్టి జారిపడడంపై డ్రైవర్లకు, ఓనర్లకు తీవ్ర హెచ్చరిక..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఇటీవల రోడ్లపై టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు నుండి అధిక లోడు ద్వారా ఇసుక , మట్టి ఇతర మెటీరియల్స్ జారి పడి పలు ప్రమాదాలు జరుగుతున్న సందర్భంగా నివారణ చర్యల్లో భాగంగా నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. టిప్పర్లపై కవర్స్ లేకుండా హై స్పీడ్, ఓవర్ లోడ్ తో వెళుతున్న పలు వాహనాలను నేరుగా ఆపి, డ్రైవర్లను మందలించి, ఓనర్స్ తో ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి ఓవర్ లోడ్ ఉండకూడదని, అలానే జనావాసాల మధ్య వెళుతున్నప్పుడు స్పీడ్ కంట్రోల్ లో ఉండాలని ప్రతీ వాహనానికి తప్పనిసరిగా కవర్ (టార్పాల్ ) తో పూర్తిగా కవర్ చేసి వెళ్లాలని లేనిపక్షంలో అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. తదనంతరం సంబంధిత మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి నియోజకవర్గంలో టిప్పర్లు గాని, లారీలు గాని, ట్రాక్టర్ లు గానీ, వ్యాన్ లు గానీ, హై స్పీడ్ తో



వెళ్తున్నా, ఓవర్ లోడ్ తో వెళ్తున్నా, వాహనంపై టార్పాల్ తో పూర్తిగా కవర్ చేయకపోయినా కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వాహనాలను సీజ్ చేయాలని ఎమ్మెల్యే 'బత్తుల' సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

# "రైతుల ఆదాయం పెంచేదిశగా పరిశోధనలు సాగాలి:ఎమ్మెల్యే బొలిశెట్టి"

తాడేపల్లిగూడెం మే 19 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ):::రైతుల ఆదాయం పెంచేదిశగా ఉద్యాన విశ్వవిద్యాలయం సరికొత్త ఆలోచనలతో పరిశోధనలు చేయాలని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. తాడేపల్లిగూడెం మండలం, వెంకట్రామన్న గూడెం డా.వై.ఎస్.ఆర్.ఉద్యాన విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం తేనె పెట్టెల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ఉద్యాన విశ్వవిద్యాలయం ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు చేపట్టారని, అందుకు అనుగుణంగా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఆలోచనలు చేయాలని అన్నారు. అంతర పంటల విషయంలో రైతులకు మెరుగైన సలహాలు, సూచనలు అందిస్తే వివిధ రకాల వాణిజ్య పంటలు సాగు చేసి ఆదాయం పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. కొబ్బరి అంతర్ పంటగా కోకో, పోక చెక్క తదితర పంటలను సాగు చేసి మంచి ఆదాయం సాధిస్తున్నారన్నారు. ఆయా భూముల రకాలను బట్టి ఏపి పంటలు వేస్తే లాభసాటిగా ఉంటుంది అనే విషయంపై రైతులు అవగాహన కలిగించాలని అన్నారు. వ్యవసాయాన్ని పరిశ్రమగా అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలని అన్నారు. వ్యవసాయ ఉద్యాన వాణిజ్య పంటల్లో ఈ ప్రాంతం ప్రథమ స్థానంలో ఉండే విధంగా విశ్వవిద్యాలయం కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో తేనెటీగల పెంపకం దారులకు సబ్సిడీ పై తేనే పెట్టెలను పంపిణీ చేశారు. ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కె.ధనుంజయ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలోవిశ్వ విద్యాలయ అధికారులు తోపాటు పాలూరి వెంకటేశ్వరరావు, పుల్లా బాబి, పసుమర్తి రామ లక్ష్మణ్, వర్తనపల్లి కాశి వాడపల్లి సుబ్బరాజు, కొనగల హరినాథ్, శనగన రాంబాబు, పసల కొండ అరసాల నారాయణ, కేతిరెడ్డి రాంబాబు, వేదపూడి వెంకటేశ్వరరావు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఆశీష్ స్టూడియోస్ విజయవాడ వారి ఆధ్వర్యంలో రాగలహరి మెగా ఈవెంట్




విస్సన్నపేట : నేటి శుభోదయ (ప్రతినిధి కమలాకర్)విజయవాడ నడిబొడ్డున పై ఆశిష్ స్టూడియోస్ వారి రాగలహరి సీజన్ 61 ని అంగరంగ వైభంగా గాన గంధర్వుడు డాక్టర్ యస్ పి బాలసుబ్రహ్మణ్యం మరియు సంగీతమాస్ట్రో ఇళయరాజా గార్ల పుట్టిన రోజును పురస్కరించుకొని గాంధీనగర్ నందు జాబిల్లి కోసం ఆకాశమల్లే వేచాను నీ రాకకై అనే అద్భుత కార్యక్రమం ఏర్పాటు చేయటం జరింది ఆశీష్ స్టూడియోస్ ద్వారా ఎందరో బర్ధమాన గాయనీ గాయకులను సినీ పరిశ్రమకు పరిచయం చేసిన ఘనత గొప్ప కీర్తి కలిగిన వారిగా 2026 జూన్ నెల 3 వ తేదీన సాయంత్రం 2 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ప్రత్యేక అంగులతో వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసే ప్రముఖ గాయనీ గాయకుల మధ్య పాడే గొప్ప సదవకాశం వినియోగించుకోవాలి అనే ఉత్సహం కలిగిన వారు మీకు నచ్చిన 5 పాటలను పాడగలను అనేవి సెలక్ట్ చేసుకొని ఈ మెగా ఈవెంట్ లో పాల్గొనేందుకు ఫోన్ పే నెంబర్ 9160160001 కి 1200/- రిజిస్ట్రేషన్ ఫీజ్ చెల్లించి సభ్యత్వం పొందగలరు సభ్యులన ప్రతి ఒక్కరికి 5 పాటలు పాడే అవకాశం కల్పించటం జరుగుతుందని ఆశీష్ స్టూడియోస్ వ్యవస్థాపకులు శ్రీమతి సత్య స్వాతి ఆరాధ్యుల మరియు వారి కుమారులు సూర్య విజయవాడ వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ మరిన్ని వివరాలకు 9160960009 నెంబరును సంప్రదించగలరని తెలియచేశారు

# ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



విజయవాడ, మే 19 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) వైసీపీ హయాంలో అణిచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచి చేయూతనిస్తుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కరోనా సమయంలో మాస్క్ అడిగిన దళిత డాక్టర్ సుధాకర్‌ను చిత్రహింసలకు గురి చేసి ఆయన మరణానికి వైసీపీ నాయకులే కారణమయ్యారని ఆరోపించారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను దారుణంగా హత్య చేసి డోర్ డెలివరీ చేశారని గుర్తు చేశారు. ఇదే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన ఎంతోమందిని పోలీస్ కేసులతో వేధించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా, ఇప్పటికే ఉన్న పరిశ్రమలను కూడా తరిమేశారని ఆరోపించారు. జగన్ పాలనలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వేలాది మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. తమ కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని యార్లగడ్డ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 20 నెలల కాలంలో 6,28,347 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగాన్ని పారద్రోలేందుకు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులతో 25 లక్షల ఉద్యోగాలు సృష్టించేందుకు తమ కూటమి ప్రభుత్వం కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్లు వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించి భారీ స్థాయిలో టీచర్ పోస్టులను భర్తీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉన్నత విద్యను బలోపేతం చేసేందుకు యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,500 అధ్యాపక పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు. గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల భర్తీతో పాటు 1,000 కానిస్టేబుల్ పోస్టులు, 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టినట్లు చెప్పారు. అర్హులైన నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు దక్కేలా అత్యంత పారదర్శకంగా నోటిఫికేషన్ విడుదల నుంచి పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, నియామక ప్రక్రియ ముగిసే వరకు ప్రతి దశలోనూ జాబ్ క్యాలెండర్‌లో స్పష్టమైన గడువులను ప్రభుత్వం నిర్ణయించినట్లు వివరించారు. పరిపాలన దక్షత కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యార్థులు, యువతకు అన్ని విధాల అండగా నిలుస్తుంటే, జగన్ రెడ్డి మాత్రం తన అవినీతి, అరాచక పాలనతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేశారని మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ పరిశ్రమలను తీసుకురావడంలో దూసుకుపోతున్న మంత్రి నారా లోకేష్, గ్రామీణ ప్రాంతాలను తనదైన శైలిలో అభివృద్ధి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ కోరారు.

# సెంట్రల్ జి.ఎస్.టి కమిషనర్ గా అరుణ్ రిచర్డ్ బాధ్యతల స్వీకరణ





గుంటూరు, మే 19 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) సెంట్రల్ జి.ఎస్.టి గుంటూరు కమిషనరేట్ నూతన కమిషనర్ గా అరుణ్ రిచర్డ్ పదవి బాధ్యతలు చేపట్టారు. మంగళవారం గుంటూరు కన్నావారితోటలోని జి.ఎస్.టి ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.అరుణ్ రిచర్డ్ 2007 సివిల్ సర్వీసెస్ బ్యాచ్ కు చెందిన ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ అధికారి. అరుణ్ రిచర్డ్ విశాఖపట్నం జి.ఎస్.టి, కస్టమ్స్ జోన్ లోని ఐదు కమిషనరేట్లకు అప్పీలెట్ అథారిటి గా, సెంట్రల్ ట్యాక్స్, కస్టమ్స్ అప్పీల్స్ కమిషనర్ గా పనిచేస్తూ, గుంటూరు జి.ఎస్.టి కి బదిలీ పై వచ్చారు. కమిషనర్ మాతృబాష తెలుగు. సెంట్రల్ జి.ఎస్.టి కమిషనర్ పరిధిలోకి రాష్ట్రంలోని కోనసీమ జిల్లాలు, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలు వస్తాయి. ఈ జిల్లాల్లోని ఐదు జి.ఎస్.టి డివిజన్ కార్యాలయాలకు, 36 జి.ఎస్.టి రేంజ్ ఆఫీసు కార్యాలయాలకు కమిషనర్ ప్రాతినిధ్యం వహిస్తారు. కమిషనర్ నేతృత్వంలో అదనపు కమిషనర్లు, సంయుక్త కమిషనర్లు, డిప్యూటీ మరియు అసిస్టెంట్ కమిషనర్లు, సూపరింటెండెంట్లు, ఇన్స్పెక్టర్లు పన్ను వసూళ్లపై దృష్టి సారిస్తారు. అరుణ్ రిచర్డ్ నూతనంగా ఛార్జ్ తీసుకున్న సందర్భంగా శాఖాపరంగా వివిధ హోదాలలోని అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు ఆయనను కలిసి, పుష్ప గుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. తొలుత కమిషనర్ కు అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, జాయింట్ కమిషనర్ దేవ్ కుమార్, పి.ఆర్.ఓ ఆర్.పి.పి కుమార్ ఘనమైన స్వాగతం పలికారు. సిబ్బంది మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు.

# రేవంత్ పోవాలి, కేసీఆర్ రావాలి అనే నినాదంతో ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారు

### : మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

### - ఖమ్మం 44వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ లోకి చేరికలు

### -- పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి పువ్వాడ



ఖమ్మం, నేటి శుభోదయ ::: తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పోవాలి, కేసిఆర్ రావాలి అనే నినాదంతో ముందుకు వెళ్ళాలని తెలంగాణ రాష్ట్ర మాజీ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఖమ్మం నగరంలో గల 44వ డివిజన్ లో పార్టీ చేరికల కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ మోసం చేసి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని, ఇందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు అని చెప్పారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకోవడం కాదు ప్రజలకు ఏం చేశారో చెప్పాలి అని తెలిపారు.ఆనాడు బీఆర్ఎస్ చేసిన ఖమ్మం అభివృద్ధిని కాంగ్రెస్ నేతలు మేము చేశామని మందికి పుట్టిన బిడ్డను మా బిడ్డ అన్నట్టు ముద్దుపెట్టుకున్నారు అని చెప్పారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని కాంగ్రెస్ నేతలు ఫ్లెక్సీలు, బ్యానర్ల వేసుకొని ప్రచారం చేస్తున్నారు. అన్నీ మతాలకు వర్గాలకు మంచి చేసిన పార్టీ మా బీఆర్ఎస్ మాత్రమే అని తెలిపారు. చెడు తర్వాత మంచి, చీకటి తర్వాత వెలుగు వస్తుంది. తప్పకుండా మళ్లీ వస్తాం అని తెలిపారు. కష్టపడి జీవనం సాగించే పేదలు నాతో కలిసి నడిచారు అని తెలిపారు. 44వ డివిజన్ లో పువ్వాడ తో ఉన్న పేదలను కాంగ్రెస్ నాయకులు ఇబ్బందులకు గురిచేశారు కానీ గుండె ధైర్యంతో పువ్వాడ వెంటే నిలబడ్డారు అని తెలిపారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చారు. ఓట్లు వేసిన పేదల మీదనే మార్కెట్ లో ఇబ్బందులు పెట్టారు అని తెలిపారు. మార్పు అన్నారు కానీ ప్రజలు బతుకులు ఏం మారలేదు కాక ఉన్న కరెంట్ పోతుంది, అపరిశుభ్రంగా నగరం తయారయింది అని తెలిపారు. పదవులు చూసుకుని మురిసిపోవడం, తప్పా ప్రజలకు కాంగ్రెస్ చేసింది ఏమీ లేదు అని అన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఊరూవాడా తిరిగి పార్టీ కోసం పనిచేస్తా, ప్రజల్లో చైతన్యం తీసుకోస్తాం అని పువ్వాడ తెలిపారు. వెలుగుమట్లలో పేదల ఇళ్లు కూల్చి కబ్జాదారులకు అప్పగిద్దామని కాంగ్రెస్ నేతలు అనుకుంటే మేము ప్రతిఘటించి పేదలకు అండగా నిలిచాం అని గుర్తు చేశారు. కేబుల్ బ్రిడ్జి మంజూరు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలు కేబుల్ బ్రిడ్జి తీగలు పట్టుకుని వేలాడినా ఎవరు మంజూరు చేశారో ప్రజలకు తెలుసని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మెహమూద్, మొయిన్, జానీ, సాయి, అజాస్, సోహైల్, జావీద్ తదితరులు పార్టీలో చేరారు. నాయకులు ఆర్ జే సి కృష్ణ, పగడాల నాగరాజు, తాజుద్దీన్, మక్బుల్, బచ్చు విజయ్ కుమార్,బత్తుల మురళీ,శీలంశెట్టి వీరభద్రం,బుర్రి వెంకటేశ్వర్లు,బుర్రి వినయ్,బుడిగం శ్రీను,పాలడుగు పాపారావు,గొల్లపుడి రాంప్రసాద్, మాటేటి కిరణ్,మోరంపూడి సాయి,షకీనా,ఖదీర్,మోహన్ రావు, షకీల్,గౌరీనాద్,వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను కలిసిన డాక్టర్ మహబూబ్ వలి





విజయవాడ, మే 19 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) విజయవాడ నగరంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్ర మాజీ మంత్రివర్యులు పల్లం రాజు, ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షులు ఎన్. రఘువీరా రెడ్డి అలాగే ప్రస్తుత ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, మైనార్టీల సమస్యలు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. నాయకుల సూచనలు, సలహాల మేరకు జిల్లాలో పార్టీని ముందుకు తీసుకెళ్తామని డాక్టర్ మహబూబ్ వలి తెలిపారు.

## రఘునాథపాలెంలో గ్రామపంచాయతీ స్థలం ఆక్రమణ

**- హెచ్చరిక బోర్డు తొలగించి ఇంటి నిర్మాణం**




ఖమ్మం, నేటి శుభోదయ ::: రఘునాథపాలెం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీకి చెందిన స్థలాన్ని ఆక్రమిస్తూ ఓ వ్యక్తి ఇంటి నిర్మాణ పనులు చేపట్టడం స్థానికంగా కలకలం రేపుతోంది. గత ఏడాది ఇదే స్థలంలో ఆక్రమణదారుడు ఫెన్సింగ్ ఏర్పాటు చేయగా, గ్రామ పంచాయతీ కార్యదర్శి అనురాధ స్పందించి ఫెన్సింగ్ తొలగించారు “ఇది గ్రామపంచాయతీ స్థలం ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం” అంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసారు. అయితే తాజాగా అదే స్థలంలో హెచ్చరిక బోర్డును తొలగించి మళ్లీ నిర్మాణ పనులు ప్రారంభించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బహిరంగంగానే నిర్మాణ సామగ్రి నిల్వ చేసి పనులు కొనసాగిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ స్థలాన్ని కబ్జా చేస్తూ ఇంటి నిర్మాణం సాగుతున్నా చర్యలు లేకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన స్థలాలను కొందరు అక్రమంగా స్వాధీనం చేసుకుంటే భవిష్యత్‌లో పంచాయతీకి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రెవెన్యూ, పంచాయతీ అధికారులు జోక్యం చేసుకుని ఆక్రమణను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. - స్థానికులు ఆగ్రహం“గతంలో అధికారులు స్వయంగా ఫెన్సింగ్ తొలగించి హెచ్చరిక బోర్డు పెట్టారు. ఇప్పుడు అదే బోర్డును తొలగించి నిర్మాణం చేస్తున్నా చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యకరం” అని స్థానికులు మండిపడుతున్నారు. గ్రామపంచాయతీ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, లేకపోతే మరిన్ని ఆక్రమణలకు తావుంటుందని హెచ్చరిస్తున్నారు.

## జాతీయస్థాయి నాటకోత్సవాలను జయప్రదం చేయండి



గుడివాడ, మే 19 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుడివాడ లో ఈ నెల 24, 25, 26 తేదీల్లో జాతీయ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నామని చేయాలని కృష్ణా ఆర్ట్స్ కార్యవర్గ సభ్యులు కోరారు. శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాటకోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కృష్ణా ఆర్ట్స్ అధ్యక్షులు పివి సత్యనారాయణ మాట్లాడుతూ జాతీయ నాటకోత్సవంలో తొలి రోజు “మహాపురుషుడు మండలి” నాటకాన్ని ఏ.ఐ. పరిజ్ఞానంతో 45 మంది కళాకారులతో అద్భుత రీతిలో ప్రదర్శించడం జరుగుతుందని, 25న “సహన” నాటకం, “కపిరాజు” నాటికలు, 26న “అమ్మ చెక్కిన బొమ్మ”, చారిత్రక నాటకం “ఖడ్గ తిక్కన” ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ప్రముఖ రంగస్థలం దర్శకులు, నటులు, అరవింద్ ఆర్ట్స్ తాడేపల్లి వ్యవస్థాపకులు, గంగోత్రి సాయి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్లో నాటక రంగానికి గుడివాడ ప్రాంత ప్రజలు విశేషమైన ఆదరాభిమానాలు సహాయ సహకారాలు అందించడం అభినందించదగ్గ విషయమని ఎంతో వ్యయప్రయాసలతో నిర్వహిస్తున్న ఈ నాటకోత్సవాలను ఆదరించాలని ప్రేక్షకులను కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణ ఆర్ట్స్ కన్వీనర్ ఆర్ వి ఎల్ నరసింహారావు, కార్యదర్శి ఏ.ఎస్.వి. ప్రసాద్, ఆర్థిక కార్యదర్శిడి . చంద్రశేఖర్, నరహరిశెట్టి ప్రసాద్, బండారు రాధాకృష్ణ , రంగనాయకులు , ఆర్టీసీ స్వామి , శ్రీకాంత్, పి . వి . ఎన్ . బి . ప్రసాద్ , మరడాని వెంకటేశ్వరరావు , సుఖ మంచి మల్లిక్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదరణ 3.0తో శాశ్వత ఉపాధి

**రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**



అమరావతి, మే 19 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఆదరణ 3.0 పథకం ద్వారా బీసీలకు శాశ్వత ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ పథకం ద్వారా ఆధునిక పనిముట్లు అందజేస్తామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ లో బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత మంగళవారం ఆదరణ 3.0 పథకం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తొలుత ఆదరణ 3.0 పథకం అమలులో భాగంగా కుల వృత్తులకు ఎటువంటి ఆధునిక పరికరాలు ఇవ్వనున్నారో వివరించారు. యువతకు కూడా ఉపాధి లభించేలా యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీలకు ఆర్థిక మేలు కలిగించడంతో పాటు వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. గతంలో ఆదరణ 1, ఆదరణ 2 పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేశారన్నారు. ఇప్పుడు ఆదరణ 3.0 పథకానికి శ్రీకారం చుడుతున్నారని, ఇందుకోసం రూ.1000 కోట్లు వెచ్చిస్తున్నారని వెల్లడించారు. వ్యక్తిగతంగా, గ్రూపులుగా లబ్ధి కలిగేలా ఆదరణ యూనిట్ల ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కుల వృత్తుదారులకు ఆధునిక పనిముట్లు అందజేయనున్నామన్నారు. లబ్ధిదారులకు వృత్తి నైపుణ్యం పెంచుకునేలా శిక్షణ అందజేస్తామన్నారు. లబ్ధిదారులకు రూ. 10 వేల నుంచి రూ. 50 వేల వరకు ఆదాయం వచ్చేలా యూనిట్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదరణ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం ప్రభుత్వమే కల్పిస్తుందని మంత్రి సవిత తెలిపారు. ఇప్పటికే అన్ని బీసీ కులాల కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లతో ఆదరణ 3.0 పథకంపై అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. యూనిట్ల మంజూరులో వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని మంత్రి సవిత వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఇతర అధికారులు, వివిధ బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు పేరేపి ఈశ్వర్, మల్లెల ఈశ్వరరావు, ఆకాశపు స్వామి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 5 వ విడత మొబైల్ రికవరీ మరియు పంపిణి కార్యక్రమంలో భాగంగా రికవరి చెయ్యబడిన 166 మొబైల్ ఫోన్ లను బాధితులకు అందజేసిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపిఎస్

బాపట్ల నేటి శుభోదయమే 19:రికవరి చెయ్యబడిన మొబైల్ ఫోన్ ల విలువ 33 లక్ష 20 వేలు ఇప్పటి వరకు మొత్తం 5 విడతలలో 1125 మొబైల్ ఫోన్ లు రికవరి చేసిన జిల్లా పోలీస్ యంత్రాంగం వీటి మొత్తం విలువ 2 కోట్ల 25 లక్షల రూపాయలు గతంలో 30 శాతంగా ఉన్న మొబైల్ రికవరీ శాతాన్ని సుమారు 70 కు తీసుకురావడం జరిగింది సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ లు కొనుగోలు చేసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి అనుమానస్పద వ్యక్తుల నుండి సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ లు కొనుగోలు చెయ్యవద్దు సరైన ఆధారాలు లేకుండా మొబైల్ షాప్ నిర్వాహకులు సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ల లాక్ ఓపెన్ చెయ్యరాదు జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపిఎస్. సరైన ఆధారాలు లేకుండా మొబైల్ షాప్ నిర్వాహకులు సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ల లాక్ ఓపెన్ చెయ్యరాదని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపిఎస్ తెలిపారు. 5వ విడత మొబైల్ రికవరీ పంపిణి కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక బృందం మరియు స్థానిక పోలీసులు సంయుక్తంగా రికవరీ చెయ్యబడిన 166 మొబైల్ ఫోన్ లను జిల్లా ఎస్పీ మంగళవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధితులకు స్వయంగా అందజేసినారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి వ్యక్తి జీవితంలో మొబైల్ ఫోన్ అత్యంత కీలకమైన సాధనంగా మారిందన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ సేవలు, విద్య, ఉద్యోగాలు, వ్యాపార కార్యకలాపాలు అన్నీ మొబైల్ ఫోన్ ద్వారానే జరుగుతున్నాయన్నారు. అలాంటి ఫోన్ పోగొట్టుకున్నప్పుడు ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతారని, అలాంటి ప్రతి బాధితుడికి అండగా నిలవాలనే లక్ష్యంతో జిల్లా పోలీస్ శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో నిష్ణాతులైన పోలీస్ అధికారులు, సిబ్బందితో సీఐ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రత్యేక బృందం మరియు స్థానిక పోలీసులు సంయుక్తంగా పనిచేస్తూ పోగొట్టుకున్న లేదా దొంగలించబడిన మొబైల్ ఫోన్లను సమర్థవంతంగా రికవరీ చేసి బాధితులకు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 5 విడతలలో 1125 మొబైల్ ఫోన్ లు రికవరి చేసి బాధితులకు అందించడం జరిగిందన్నారు. వీటి మొత్తం విలువ సుమారు 2 కోట్ల 25 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. మొబైల్ రికవరీ శాతం 30 గా ఉన్న



బాపట్ల జిల్లాలో మొబైల్ రికవరీ పంపిణి కార్యక్రమం చేపట్టిన తర్వాత ప్రస్తుతం 70 శాతంకు చేరుకుందాన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు కొనసాగిస్తున్నామన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న ప్రతి ఒక్క బాధితుడికి ఫోన్ తిరిగి అందించడమే లక్ష్యంగా బాపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం పనిచేస్తుందన్నారు. 5వ విడత మొబైల్ రికవరీ పంపిణీ కార్యక్రమంలో భాగంగా 33 లక్ష 20 వేల విలువ గల 166 మొబైల్ ఫోన్ లను రికవరీ చేయడం జరిగిందన్నారు. వాటిని ఈ కార్యక్రమం ద్వారా బాధితులకు అందించడం జరుగుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో నైపుణ్యం కలిగిన ప్రత్యేక బృందాలతో మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసి వేగంగా రికవరీ చేస్తున్నామని తెలిపారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ఉన్న ఫోన్లను కూడా సంబంధిత పోలీస్ శాఖలతో సమన్వయం చేసుకొని తిరిగి బాధితులకు అందజేస్తున్నామన్నారు.

మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నప్పుడు చేయవలసినవి:

వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి

పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ కంప్లైంట్ నమోదు చేయాలి

నంబర్, బిల్ లేదా బాక్స్ వివరాలు భద్రంగా ఉంచుకోవాలి

ప్రజలకు, మొబైల్ షాపుల యజమానులకు సూచనలు:

సరైన ఆధారాలు లేకుండా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనరాదు. లాక్ ఓపెన్ చేయరాదు

లేదా ఖీవీ యాప్ ద్వారా తప్పనిసరిగా తనిఖీ చేయాలి

అపరిచిత వ్యక్తుల వద్ద నుండి మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్త వహించాలి

అనుమానాస్పద ఫోన్లపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

దొంగిలించిన మొబైల్ ఫోన్లను కొనుగోలు చేయడం లేదా విక్రయించడం చట్టరీత్యా నేరమని, దీనివల్ల క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశం ఉందని ఎస్పీ గారు హెచ్చరించారు. పోగొట్టుకున్న లేదా దొంగలించబడిన మొబైల్ ఫోన్లను సమర్ధవంతంగా రికవరీ చేసి బాధితులకు అందించడంలో సోషల్ మీడియా సీఐ వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం నిర్వహిస్తున్న విధులు అభినందనీయమన్నారు. రాబోయే రోజులలో కూడా మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించి 100% మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించే విధంగా పనిచెయ్యాలని ఎస్పీ గారు తెలిపారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ తిరిగి పొందడం కష్టం అనుకున్న తరుణంలో తమ మొబైల్ ఫోన్లు తిరిగి పొందిన బాధితులు జిల్లా పోలీస్ శాఖకు, జిల్లా ఎస్పీ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేపల్లె, బాపట్ల, చీరాల, సిసిఎస్ డీఎస్పీలు ఏ.శ్రీనివాసరావు, సిహెచ్.చంద్రమౌళి, శఎండి.మోయిన్, శ్రీ పి.జగదీష్ నాయక్, సోషల్ మీడియా ఇన్స్పెక్టర్ వి.సూర్యనారాయణ, అడ్మిన్ ఆర్.ఐ షేక్ మౌలుద్దీన్, ఐటీ కోర్ ఎస్సైలు నాగేశ్వరరావు, అనూష తదితరులు పాల్గొన్నారు.




## మత్యకారుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోంది

**-రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర**

మచిలీపట్నం మే 19 ) అజయ్ నారగాని - నేటి శుభోదయ ) మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని, చేపల వేట నిషేధ కాలంలో 1,30,000 మంది మత్స్యకారులకు 286 కోట్ల రూపాయలు వేట నిషేధ భృతిని మంజూరు చేసి ఆదుకుంటూ ఉందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లాలో ప్రారంభించిన మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో భాగంగా జిల్లా నుండి నగరంలోని కలెక్టరేట్ వి.సీ. హాలులో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, డీసీఎంఎస్ అధ్యక్షులు బండి రామకృష్ణ, తదితరులతో కలిసి పాల్గొన్నారు. జిల్లాకు చెందిన 18,157 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 20 వేల రూపాయల చొప్పున 36 కోట్ల 31 లక్షల 40 వేల రూపాయల మెగా చెక్కును మంత్రివర్యులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మత్స్యకారులను ఉద్దేశించి మంత్రివర్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చాలా ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి మొట్టమొదటిసారిగా. గత సంవత్సరమే మత్స్యకార సేవలో పథకాన్ని చేపట్టి మత్స్యకారులు వేట నిషేధ కాలంలో ఇబ్బంది పడకూడదని 20 వేల రూపాయలు చొప్పున వేట నిషేధ మృతిని ఇచ్చిన ముఖ్యమంత్రికి హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నానన్నారుఇదివరకు తన మామగారైన నడుకుదిటి నరసింహారావు ప్రత్యేక కృషితో వేట నిషేధ కాలంలో బియ్యము ఆయిల్ సబ్సిడీకి ఇచ్చే ఏర్పాటు చేశారన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని చేపలు పట్టే విధంగా సులభంగా చేపలు పట్టే విధంగా అవసరమైన పరికరాలు కూడా అందించడం జరిగిందన్నారు. తర్వాత 2014 లో ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి మత్స్యకారులు పడుతున్న ఇబ్బందులను కష్టాలను




గుర్తించి వారికి తొలిసారిగా 4000 రూపాయల వేట నిషేధ భృతిని అందించేందుకు ముందుకు వచ్చారన్నారు. గత ప్రభుత్వం చెరువులన్నీ కొట్టేయడానికి తెచ్చిన జీవో నంబర్ 217 ను తాము వ్యతిరేకించి పోరాటం చేశామని, తమ ప్రభుత్వం వచ్చాక రద్దు చేసి అందరికీ మేలు చేసిందన్నారుమన ప్రభుత్వం చేస్తున్నటువంటి పథకాలు గాని కేంద్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి కార్యక్రమాలు గాని తెలియజేసేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన అనే కార్యక్రమం ఉందనీ, కోటి 20 లక్షల రూపాయలతో డీప్ సీ బోట్లు నిర్మాణం చేయడానికి ఇచ్చారన్నారు. మన ప్రాంతంలో ఒక్క బోటు కూడా తయారు కాలేదని. అందుకనే మన ముఖ్యమంత్రికి చెప్పానని ఎందుకంటే 40శాతం సబ్సిడీ ఉందనీ, ఎస్సీ సోదరులకి మహిళలకి 60శాతం సబ్సిడీ ఇస్తే బాగుంటుందని ముఖ్యమంత్రికి చెప్పగా అదనంగా 20 శాతం సబ్సిడీకి ఒప్పుకోవడం జరిగిందన్నారు. మిగిలిన మొత్తానికి కూడా బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించే బాధ్యత కూడా తీసుకుంటామన్నారు. గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ వద్ద 6 ఎకరాల స్థలం పడవల నిర్మాణానికి ఇంజనీర్ల ద్వారా సాంకేతికతపై మత్యకారులకు శిక్షణ ఇచ్చే నిమిత్తం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే కాకుండా ఇవాళ సముద్ర నాచు పండించేందుకు కూడా చాలా అవకాశం ఉందనీ, ద్వాక్రా మహిళలు ముందుకు వస్తే వారికి శిక్షణ ఇస్తామని, దాంతో మంచి ఆదాయము లభిస్తుందన్నారు. దాని మీద కూడా పరిశోధన చేయడానికి సింగరాయ కొండలో జరుగుతూ ఉందన్నారు. ఒకసారి నేను వాళ్ళని ఇక్కడ రమ్మని చెప్పి కలెక్టర్ తో ఒక సమావేశం పెట్టమని చెప్తున్నామన్నారు. మచిలీపట్నంలో పీతల హేచరీకి రెండు కోట్ల 70 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందని అందులో తొలి విడతగా 75 లక్షల రూపాయలు విడుదలచేయడం జరిగిందన్నారు. త్వరలోనే మత్స్యకారులందరికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి అవకాశాలు లభించేలా కృషి చేస్తామన్నారు. అలాగే తీర ప్రాంతం అంతా కూడా ఎక్కడ ఎలాంటి కార్యక్రమాలు చేస్తే మన వాళ్ళు బలపడతారో ఆ కార్యక్రమం చేయడానికి సిద్ధంగా ఉంటామన్నారు. పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మత్స్యకార సోదరులందరికీ కూడా అండగా నిలవాలనే లక్ష్యం తోటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు .ఈ సంవత్సరానికి వేట నిషేధ కాలంలో మత్స్యకారులు ఎవరూ కూడా ఇబ్బంది పడకూడదని 286 కోట్ల రూపాయలు అందరి బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరిగిందన్నారు. గతంలో చంద్రన్న భీమా ఉండటం వల్ల మత్స్యకారులు అందరూ కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉన్నారన్నారు. గత ప్రభుత్వం రాగానే ఆ చంద్రన్న భీమా రద్దు చేయడం వల్ల కూడా మరి ఎన్నో ఇబ్బందులు ...

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ షెడ్యూల్ ప్రకటించిన భారత్ ఎన్నికల సంఘం

**కృష్ణాజిల్లా కలెక్టర్ డి . కె.బాలాజీ**




మచిలీపట్నం మే 19 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం షెడ్యూల్ ను భారత్ ఎన్నికల సంఘం ప్రకటించినదని, వచ్చే జూన్ 15వ తేదీ నుండి బిఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓటర్ నమోదు కార్యక్రమం చేపడతారని ఆలోగా అందరూ బిఎల్ఎ లను నియమించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని డీకే బాలాజీ వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపట్టుటకు షెడ్యూల్ను ప్రకటించిన అన్నారు. ఆ షెడ్యూల్ ప్రకారం వచ్చే జూన్ 5వ తేదీ నుండి 14వ తేదీ వరకు సవరణ కార్యక్రమం పైన సన్నద్ధత, శిక్షణలు, ముద్రణలు జరుగుతాయన్నారు. జూన్ 15వ తేదీ నుండి జూలై 14వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి ఓటర్ల నమోదు కార్యక్రమం చేపడతారన్నారు. ఓటరు నమోదు పత్రాలు అందజేస్తారన్నారు. జూలై 14 వ తేదీన పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ జరుగుతుందన్నారు. జూలై 21వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. జూలై 21వ తేదీ నుండి ఆగస్టు 20 వ తేది వరకు ఓటర్ల జాబితా పై క్లైములు గాని, అభ్యంతరాలు గాని స్వీకరించడం జరుగుతుందన్నారు జూలై 21 నుండి సెప్టెంబర్ 18వ తేదీ వరకు క్లైములను అభ్యంతరాలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం సెప్టెంబర్ 22వ తేదీన ఓటర్ల జాబితా చివరి ప్రచురణ జరుగుతుందన్నారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీలో బూతు స్థాయి ఏజెంట్ల పాత్ర చాలా కీలకమన్నారు. జిల్లాలోని మొత్తం 1769 పోలింగ్ కేంద్రాలకు అన్ని రాజకీయ పార్టీలు బూతు స్థాయి ఏజెంట్లను వెంటనే నియమించాల్సి ఉందన్నారు. బూత్ సాయి ఏజెంట్లు నియమించకపోతే ఆ పార్టీకి భవిష్యత్తులో ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు చెప్పే అవకాశం కోల్పోతారన్నారు. ఇప్పటివరకు 1769 పోలింగ్ కేంద్రాలకు గాను తెలుగుదేశం పార్టీ 1710, బిఎల్ఎ లను, వైఎస్ఆర్పిపి 1233 మందిని, జనసేన 267 మందినీ, బిజెపి 21 మంది బిఎల్ఎ లను నియమించిందన్నారు. భారత కాంగ్రెస్ పార్టీ, సిపిఎం, బీఎస్పీ ఒక్క బిఎల్ఎ ను కూడా నియమించలేదన్నారు గుడివాడ, పెనమలూరు నియోజకవర్గాలకు వైఎస్ఆర్పిపి ఇంకా ఒకరిని కూడా నియమించలేదన్నారు. ఓటర్ నమోదు పత్రాలు తీసుకున్నాక ప్రజలు వాటిని భర్తీ చేసి తిరిగి బిఎల్ఓ లకు అందజేయాలన్నారు. ఎవరైతే ఆ పత్రాలు తిరిగి ఇవ్వరో వారి పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉండవని స్పష్టం చేశారు. ఈ విషయం అన్ని రాజకీయ పార్టీలు గుర్తు ఉంచుకొని ఓటరు నమోదు పత్రాలు తిరిగి వచ్చేలా కృషి చేయాలన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటరుగా నమోదు కాకుండా మిగిలిపోరాదని ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం ప్రతినిధులు బిఎంవి దాస్, బిజెపి జిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరామ్, రాష్ట్ర కార్యదర్శి గజేంద్రరావు, బీఎస్పీ ప్రతినిధి బాలాజీ, సిపిఎం ప్రతినిధి కొడాలి శర్మ, వైసిపి ప్రతినిధి సిలార్ దాదా , కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్ సేవలు పెంచాలి

**: డాక్టర్ ఎం. హరి జవహర్ లాల్ దేవాలయాల్లో 'జీరో వేస్ట్ డిస్పోజల్ పాలసీ'ని**

**అమలు చేయాలి : కమిషనర్ కె. రామచంద్ర మోహన్**

విజయవాడ, మే 19 (నేటి శుభోదయ):- భారతదేశంలోనే ప్రత్యేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక స్థానం కలిగిన ఆంధ్రప్రదేశ్ దేవాలయాలలో భక్తులకు కల్పించే సౌకర్యాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని దేవాదాయ శాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి డాక్టర్ ఎం. హరి జవహర్ లాల్ స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం గొల్లపూడిలోని దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆర్.జె.సి, డిప్యూటీ కమిషనర్ కేడర్‌కు చెందిన 22 ప్రధాన దేవాలయాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లతో వివిధాంశాలపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. హరి జవహర్ లాల్ మాట్లాడుతూ, భక్తులకు మరింత సులభంగా, వేగంగా సేవలు అందించేందుకు ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలను పెద్ద ఎత్తున పెంపుదల చేయాలన్నారు. అలాగే కాలమాన పరిస్థితులకు అనుగుణంగా నూతన ఆర్జిత సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఈవోలను ఆదేశించారు. దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ మాట్లాడుతూ, దేవాలయాలు సమాజ భారం మోసేలా ఉండాలే తప్ప, సమాజానికి భారం కాకూడదని అన్నారు.

'స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఆలయాల నుండి చెత్తను వేస్ట్ డంపింగ్ యార్డులకు పంపకుండా, 'జీరో వేస్ట్ డిస్పోజల్ పాలసీ' ని పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రజారోగ్యం, పారిశుధ్యం విషయంలో అన్ని ఆలయాల్లో అత్యంత మెరుగైన విధానాలు, పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఏదైనా ఒక ఆలయంలో అమలు చేస్తున్న మెరుగైన విధానాలు విజయవంతమైతే, అదే 'సక్సెస్ మంత్ర'ను రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లోనూ విస్తరింపజేసి అమలు చేయాలని కమిషనర్ వివరించారు. భూగర్భ జలాల పెంపునకు అన్ని ఆలయాలు ముందడుగు వేయాలని, భవనాలపై 'రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్' (వర్షపు నీటి సంరక్షణ) పద్ధతులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాలలో సూయజ్, సల్లేజ్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, నీటిని శుద్ధి చేసి పునర్వినియోగంలోకి తేవాలని, వ్యర్థాల నుండి ఇంధనాన్ని తయారు చేసేలా గోబర్ గ్యాస్, బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

రాబోయే ఒక నెల రోజుల్లోగా అన్ని దేవాలయాల్లో పైప్డ్ గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు పూర్తి కావాలని, సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, ఆలయాల్లో సంప్రదాయేతర విద్యుత్ వనరులను ప్రోత్సహించాలని, ప్రకృతి ప్రసాదించిన శక్తులను గరిష్టంగా వినియోగించుకోవాలని కమిషనర్ రామచంద్ర మోహన్ కోరారు. దేవస్థానంలో ఉచిత సేవలందించే సేవకులే ఆలయాల ప్రచారకర్తలుగా బాధ్యతలు అప్పగించాలని, ఆన్ లైన్ సేవలు, సోషల్ మీడియా ప్రచారం, ఆధ్యాత్మిక కార్యక్రమముల వ్యాప్తి సేవకుల ద్వారా జరుగాలని కమిషనర్ ఆదేశించారు. భక్తుల సేవే పరమావధిగా, పర్యావరణ అనుకూల హరిత ఆలయాలుగా ఆంధ్రప్రదేశ్ దేవాలయాలను తీర్చిదిద్దాలని కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు, 22 ప్రముఖ ఆలయాల ఈవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయవాడ, శ్రీ శైలం, అన్నవరం, సింహాచలం, ద్వారకా తిరుమల, శ్రీ కాళహస్తి, కాణిపాకం దేవాలయాల అధికారులు దేవాలయాల అభివృద్ధి పనులు పురోగతి గురించి వివరించారు.

## జాతీయస్థాయిలో వ్యర్థాల నిర్వహణపై ఉత్తమ విధానాలను ప్రదర్శించిన వీఎంసి

: కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, మే 19 (నేటి శుభోదయ):- జాతీయస్థాయిలో వ్యర్థాల నిర్వహణపై ఉత్తమ విధానాలను విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ప్రదర్శించారు . మంగళవారం సాయంత్రం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్‌పై నిర్వహించిన జాతీయ స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.గత సమావేశంలో వ్యర్థపదార్థాల నిర్వహణలో విజయవాడ నగరపాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను జాతీయ స్థాయిలో ప్రదర్శించాలని కేంద్ర మంత్రిత్వ శాఖ సూచించిన నేపథ్యంలో, ఈ సమావేశంలో కమిషనర్ నగరంలో అమలు చేస్తున్న పారిశుధ్య, చెత్త సేకరణ, తడి-పొడి వ్యర్థాల వేరు నిర్వహణ, సేంద్రియ ఎరువుల తయారీ, శాస్త్రీయ వ్యర్థాల ప్రాసెసింగ్ విధానాలను సమగ్రంగా వివరించారు.ప్రత్యేకంగా మూలస్థాయిలోనే వ్యర్థాల వేరు సేకరణ, తడి చెత్తను వర్మీ కంపోస్ట్ రూపంలో మార్చడం, నగర పార్కులు, హరిత ప్రదేశాల్లో ఆ సేంద్రియ ఎరువుల వినియోగం, నిర్మాణ వ్యర్థాలతో నిర్మాణ వస్తువుల తయారీ, కొబ్బరి వ్యర్థాలతో కోకోపిట్, కొబ్బరి పీచు, ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వాహణ వంటి అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. నగరాన్ని పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దే దిశగా విజయవాడ నగరపాలక సంస్థ తీసుకుంటున్న చర్యలకు సంబంధించి అధికారులు ప్రశంసలు వ్యక్తం చేసినట్లు సమాచారం.అదేవిధంగా దేశవ్యాప్తంగా ఉత్తమ పారిశుధ్య నిర్వహణ పద్ధతులను అమలు చేస్తున్న వివిధ స్థానిక సంస్థలు తమ అనుభవాలు, వినూత్న విధానాలను ఈ సమావేశంలో పంచుకున్నాయి. వాటిని అధ్యయనం చేసి విజయవాడలో కూడా మరింత సమర్థవంతమైన విధానాలను అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కమిషనర్లు డాక్టర్ డి. చంద్రశేఖర్, ఏ. రవీంద్రరావు, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ (ఇంచార్జి) పి. సత్యకుమారి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## విజయవాడ శివారు ప్రాంతాల్లో లాంగ్ ఆర్మ్ తో గుర్రపు డెక్కల తొలగింపు



విజయవాడ, మే 19 (నేటి శుభోదయ):- రానున్న వర్షాకాలం దృశ్య నగరంలోని కాలువల్లో ఎటువంటి అంతరాయం లేకుండా నీరు ప్రవాహం ఉండాలి అంటే నగర శివారులో కూడా ఎటువంటి అంతరాయం లేకుండా నీరు ప్రవహించేటట్టు అధికారులు చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు ఆదేశించగా, మంగళవారం ఉదయం అంబాపురం పరిసర ప్రాంతాల్లో గల కాలువలో ఉన్న గుర్రపు డెక్కలను లాంగ్ ఆర్మ్ తో ప్రజారోగ్యం సిబ్బంది తొలగించారు.

## చెత్త కాదు... నగరానికి సంపద

వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, మే 19 (నేటి శుభోదయ):- నగరంలో సేకరించే వ్యర్థాలు కేవలం వ్యర్థాలు మాత్రమే కావని, అవి నగరానికి సంపదని వ్యర్థాల నుంచి సంపద తయారీకి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం నగర పర్యటనలో భాగంగా బందర్ రోడ్, పటమట, ఎలక్ట్రిసిటీ కాలనీ, యనమలకుదురు రోడ్ ప్రాంతాలను సందర్శించి పారిశుధ్య నిర్వహణ, తడి చెత్త సేకరణ, వర్మీ కంపోస్ట్ తయారీ విధానాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సేకరించే వ్యర్థాలను మూలస్థాయిలోనే తడి, పొడి చెత్తగా వేరు చేసి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ముఖ్యంగా తడి చెత్తను వర్మీ కంపోస్ట్ రూపంలో ఎరువుగా మార్చే ప్రక్రియను పూర్తిస్థాయిలో అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు.పటమట, ఎలక్ట్రిసిటీ కాలనీ లో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ యూనిట్లను పరిశీలించిన కమిషనర్, తడి చెత్త ద్వారా తయారవుతున్న సేంద్రియ ఎరువును విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని పార్కులు, రహదారి పక్కన ఉన్న మొక్కలు, ఇతర హరిత ప్రదేశాలలో వినియోగించాలని సూచించారు. ఈ విధంగా మొక్కల సంరక్షణతో పాటు వాటి పెరుగుదలకు అవసరమైన పోషకాలు అందించి నగరాన్ని మరింత హరితవనంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.అదేవిధంగా ప్రజల్లో సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన పెంచేందుకు చర్యలు చేపట్టాలని, మొక్కల పెంపకంలో భాగస్వామ్యమవుతున్న స్వచ్ఛంద సంస్థలు (టీ+ం), ప్రజలకు తక్కువ ధరలకే ఈ ఎరువును అందుబాటులో ఉంచే విధంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వర్మీ కంపోస్ట్‌కు ప్రత్యేక బ్రాండింగ్ కల్పించి, అది విజయవాడ నగరపాలక సంస్థ తయారు చేస్తున్న సేంద్రియ ఎరువుగా ప్రజలకు సులభంగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పటమట లో గల అన్న క్యాంటీన్ ను పరిశీలించి, పారిశుధ్య నిర్వహణ త్రాగునీటి సరఫరా వాడుక నీటి సరఫరా లో ఎటువంటి లోపం లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే. షమ్మీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్ పాలనలో దళితులపై దౌర్జన్యాలు - బాబు పాలనలో ఉన్నత గౌరవం: గద్దె అనురాధ



విజయవాడ, మే 19 (నేటి శుభోదయ):- వైసీపీ పాలనలో దళితులు, మహిళలు, బలహీన వర్గాలపై జరిగిన దౌర్జన్యాలను ప్రజలు ఎప్పటికీ మరవలేరని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం విజయవాడ ఆటోనగర్‌లోని తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో వైసీపీ మాజీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యకు గురై నాలుగేళ్లు పూర్తైన సందర్భంగా గద్దె అనురాధ అధ్యక్షతన సుబ్రహ్మణ్యం సంస్మరణ కార్యక్రమం నిర్వహించి వైసిపి దళితులకు చేసిన ద్రోహాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వీధి సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీధి సుబ్రహ్మణ్యం ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళితులపై జరిగిన దాడులు, హత్యలు, అవమానకర ఘటనలు రాష్ట్ర చరిత్రలో మచ్చగా నిలిచిపోయాయని అన్నారు. వీధి సుబ్రహ్మణ్యం హత్య ఘటన రాష్ట్ర ప్రజలను తీవ్రంగా కలచివేసిందన్నారు. దళితులపై కపట ప్రేమ నటించే జగన్మోహన్ రెడ్డి ఆనాడు బాధిత కుటుంబాన్ని కనీసం పరామర్శించలేదని, పైగా నిందితులను అధికార పార్టీ ప్రోత్సహించారని దీన్ని రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదన్నారు. కరోనా సమయంలో మాస్క్ అడిగినందుకు దళిత డాక్టర్ సుధాకర్ పై దాడి చేసి పిచ్చివాడని ముద్ర వేసి చనిపోయేలా చేశారన్నారు. గత వైసీపీ పాలనలో దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు, యువతపై అక్రమ కేసులు, రాజకీయ కక్షసాధింపులతో పాలన కొనసాగిందని విమర్శించారు.దేవుని నిధులుగా భావించే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను 27 వేల కోట్ల రూపాయలు, అదేవిధంగా ఎస్టీకి సంబంధించిన సబ్ ప్లాన్ నిధులు 5 వేల కోట్ల రూపాయలు కూడా భారీగా దారి మళ్లించి దళితుల అభివృద్ధిని అడ్డుకున్నారని ఆరోపించారు. 2014-19 మధ్య తాను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉన్న కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సి, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వర్గాల వారికి రోడ్లు వేయటానికి, మంచి నీటి వసతులు కల్పించటానికి మాత్రమే వాడమని, ఇంకా అవసరమైతే జనరల్ ఫండ్స్ లో నుంచి కూడా తీసి ఎక్కడ అవసరమైతే అక్కడ నిధుల్ని కేటాయించాలని చెప్పారని నేను చెప్పిన విధంగా తాను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా ఆయా వర్గాల వారికి కావాల్సిన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. పార్లమెంట్ స్పీకర్‌గా జి.ఎం.సి. బాలయోగి, అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన ప్రతిభా భారతిని నియమించి ఆయా సభల్లో ప్రధాని మంత్రి, ముఖ్యమంత్రితో పాటు సభ్యులంతా మొట్టమొదట దేవాలయం లాంటి అసెంబ్లీలో, పార్లమెంట్‌లో అడుగు పెట్టేటప్పుడు వాళ్ళకి దండం పెట్టి లోపలికి వెళ్ళేలా గౌరవం ఇచ్చి పెద్దపీట వేసిందన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు ఆశయాల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళల ఆత్మగౌరవ పరిరక్షణకే పార్టీ కట్టుబడి ఉందన్నారు. అదే దిశగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాలన కొనసాగుతోందని తెలిపారు.జగన్ పాలనలో జరిగిన దళిత వ్యతిరేక చర్యలను ప్రజలు గుర్తుంచుకోవాలని, సామాజిక న్యాయాన్ని కాపాడే ప్రభుత్వాలకు ప్రజలు మద్దతుగా నిలవాలని గద్దె అనురాధ పిలుపునిచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు గౌరవం, రక్షణ, సామాజిక న్యాయం లభిస్తోందని అనురాధ అన్నారు.ఈ విలేఖరుల సమావేశంలోజిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కొట్టేటి హనుమంతరావు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి వింజమూరి సతీష్ బాబు, పటాన్ హయత్ ఖాన్, దోమకొండ రవి, నందిపాటి దేవానంద్, దాసరి గాబ్రియల్ పాల్గొన్నారు

## వైఎస్సార్‌సీపీ హయాంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు

: ఎమ్మెల్యే గద్దె




విజయవాడ, మే 19 (నేటి శుభోదయ):- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలే కాకుండా దళిత వర్గానికి చెందిన వారిని హత్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పేర్కొన్నారు. పటమట అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే గద్దె కార్యాలయంలో మంగళవారం మీడియావారితో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయుంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలే కాకుండా హత్యలు కూడా జరిగాయని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎమ్మెల్సీ వద్ద కారు డ్రైవర్‌గా పనిచేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యంను ఎమ్మెల్సీ అనుచరులే దారుణంగా కొట్టడం వల్ల 2022వ సంవత్సరం మే 19వ తేదిన హత్యకు గురయ్యారని వివరించారు. ఎమ్మెల్సీతో తలెత్తిన వివాదం కారణంగానే వీధి సుబ్రహ్మణ్యం హత్యకు గురైయ్యారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని కారులో తీసుకువచ్చి అతని ఇంటి దగ్గర పడేసిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అనుచరులు ఈ హత్యను ప్రమాదంగా చిత్రీకరించడానికి తీవ్రంగా ప్రయత్నం చేశారన్నారు. కానీ పోలీసులు విచారణలో సుబ్రహ్మణ్యంను ఎమ్మెల్సీ అనుచరులు తీవ్రంగా కొట్టడం వల్లనే మరణించారని పోలీసుల దర్యాప్తులో స్పష్టంగా వెల్లడైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఎస్సీ వర్గాలపై దౌర్జన్యాలు, అణిచివేత, అన్యాయాలకు ఎమ్మెల్సీ డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం సంఘటనే ఉదాహరణ అని అన్నారు. ఇలాంటి ఎన్నో సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగాయని చెప్పారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు, వృత్తిపరమైన నిపుణులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిరంతరం బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడిందన్నారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి దళితులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వారికి పార్టీలోనే కాకుండా ప్రభుత్వ నామినేటెడ్ పదవుల భర్తీలో కూడా ప్రాధాన్యత ఇస్తోందని చెప్పుకొచ్చారు. దళితుల సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దళితులపై జరిగిన దాడులు, దౌర్జన్యాలను ఆ సామాజిక వర్గానికి చెందిన వారు ఎప్పటికీ మరువకూడదని, తెలుగుదేశం పార్టీ ఎస్సీ వర్గాలకు చేస్తున్న మంచి పనులను గుర్తుంచుకోవాలని గద్దె కోరారు.

## గుణదల పడవల రేవు సెంటర్ లో 16 లక్షలతో నూతన ధోభీకానా నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేసిన ఎమ్మెల్యే బొండా ఉమా

విజయవాడ, మే 19 (నేటి శుభోదయ):- గుణదల పడవల రేవు సెంటర్ వద్ద పాత ధోభీకానా వద్ద 16 లక్షల రూపాయలతో నూతన ధోభీకానా నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు రజక సంఘం సోదర సోదరీమణులతో కలిసి శంఖుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ 2019 నుండి 2024 మధ్యలో వైసీపీ పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న బీసీ, కులవృత్తుల కుటుంబాలకు మళ్లీ అండగా నిలబడటమే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 21 నెలల్లోనే తాను ఎమ్మెల్యేగా సెంట్రల్ నియోజకవర్గంలో 340 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తు ఒక పక్కన అభివృద్ధిని ప్రజలకు సంక్షేమాన్ని అందజేస్తున్నామని అన్నారు.ముఖ్యంగా రజక సోదరుల సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి ధోభీఘాట్లు, ధోభీకానాల మరమ్మతులు, ట్యాంకులు, పైపులైన్లు, షెడ్లు, ఫ్లోరింగ్ తదితర పనులకు నిధులు మంజూరు చేస్తున్నామని, గుణదల ప్రాంతంలోని ధోభీకానా అభివృద్ధికి 16 లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించామని, అదనపు అవసరాల కోసం మరిన్ని అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామని. మాకు అధికారం అంటే అహంకారం కాదు, ప్రజల పట్ల బాధ్యత అని, ప్రతి డివిజన్‌లో ప్రజల సమస్యలపై పూర్తి అవగాహనతో పని చేస్తూ బీసీ, రాజ, రా, మైనారిటీ వర్గాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు, త్వరలోనే "ఆదరణ" పథకాన్ని మళ్లీ ప్రారంభించి కులవృత్తులు చేసుకునే వారికి అవసరమైన సామగ్రి అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకులు పెసర్లంక వీరభద్రం, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, నైనవరపు వీరయ్య, సత్తెనపల్లి శ్రీనివాసరావు 1వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కమ్మినేని సురేష్, పరుచూరి భార్గవ్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## 4 పథకం ద్వారా నిరుపే కుటుంబాలకు అండగా బొండా కుటుంబం



విజయవాడ, మే 19 (నేటి శుభోదయ):- అజిత్ సింగ్ నగర్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో సెంట్రల్ నియోజకవర్గంలోని పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సూచనల మేరకు ౹ా-4 పథకం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్థ, బొండా రవితేజ తమ సొంత నిధులతో ఇప్పటికే ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్లు, టిఫిన్ బండ్లు అందించడంతో పాటు జీవనోపాధి కల్పించే పలు కార్యక్రమాలు చేపడుతున్నారు.అలాగే ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత చదువులు కొనసాగించలేని విద్యార్థులను దత్తత తీసుకొని ప్రతి నెలా వారి ఫీజులు చెల్లిస్తూ విద్యకు అండగా నిలుస్తున్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతో చేస్తున్న ఈ సేవా కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు.ఈ సందర్భంగా 61వ డివిజన్‌కు చెందిన మోర్ల దుర్గారావు పక్షవాతంతో తీవ్ర అనారోగ్యానికి గురై నడవలేని పరిస్థితిలో ఇంటికే పరిమితమై, కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండటంతో మందులు కొనుగోలు చేయడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని స్థానిక నాయకులు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్థ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన స్వయంగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించి తన సొంత నిధులతో 4,000 రూపాయల పెన్షన్ నగదును అందజేశారు. అంతేకాకుండా ప్రతినెలా ఆ కుటుంబానికి పెన్షన్ అందజేస్తామని హామీ ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటలో నివసించే బాయన అచ్చయమ్మ వృద్ధాప్యంతో గత ఐదు సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ నడవలేని పరిస్థితిలో జీవనం సాగిస్తున్నారని, గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో కరెంట్ బిల్లు అధికంగా వచ్చిందనే కారణంతో ప్రభుత్వం నుంచి అందాల్సిన పెన్షన్ నిలిపివేశారని ఎమ్మెల్యే బొండా ఉమా దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వృద్ధురాలి సమస్యకు తక్షణ పరిష్కారం చూపించాలని యువ నాయకులు బొండా సిద్ధార్థ ని ఆదేశించారు.దీనిపై వెంటనే స్పందించిన సిద్ధార్థ నేటి నుంచే ప్రతి నెల తన సొంత నిధులతో 4,000 రూపాయల పెన్షన్ అందజేస్తానని హామీ ఇచ్చి, వెంటనే 4,000 నగదును వృద్ధురాలికి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధురాలు, కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురై బొండా కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావిస్తూ పేదలకు అండగా నిలబడటం, ఆపదలో ఉన్న కుటుంబాలకు చేయూత అందించడం, ఉపాధి అవకాశాలు కల్పించడం, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడం బొండా కుటుంబం సేవా ధ్యేయమని నాయకులు పేర్కొన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో ఎవరూ ఇబ్బందులు పడకుండా ప్రతి కుటుంబానికి సహాయం అందించే దిశగా సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



విజయవాడ, మే 19 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని పురస్కరించుకుని విజయవాడలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య నిరాడంబర జీవితం, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత నేటి తరానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జీవితాంతం కట్టుబడి పనిచేసిన మహానేతగా సుందరయ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. సుందరయ్య చూపిన మార్గంలో పయనించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఈ నెల 19 నుంచి 30 వరకు తీవ్ర ఎండలు బయటకు రావద్దు

: వాతావరణ శాఖ హెచ్చరిక

విజయవాడ, మే 19 (నేటి శుభోదయ):- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 19 నుండి 30 వరకు రాష్ట్రంలో తీవ్రమైన ఎండలు, వడగాల్పులు ఉంటాయని తీవ్ర హెచ్చరికలు జారీ చేశాయి.ఈ నేపథ్యంలో కొండపల్లి మున్సిపల్ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,స్వచ్ఛంద సంస్థలు,వ్యక్తులు,అసోసియేషన్లు ముందుకు వచ్చి ప్రధాన కూడళ్లలో, బస్టాపుల వద్ద ప్రయాణికుల కోసం చలువ పందిళ్లు, మజ్జిగ, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు.వాతావరణ శాఖ సూచనల ప్రకారం అత్యవసర పనులు ఉంటే తప్ప ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు ప్రజలు ఎవరూ బయటకు రావద్దని హెచ్చరించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని కోరారు.

## ప్రేమ పేరుతో వల సీఐపై కేసు నమోదు

ఖమ్మం, నేటి శుభోదయం ::: భర్త వేధింపుల నుంచి తనను కాపాడి రక్షణ కల్పించాలంటూ ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చిన వివాహితను వంచించి లోబరుచుకున్న ఖమ్మం కమిషనరేట్ లో విధులు నిర్వహిస్తున్న ఇన్స్పెక్టర్ భూక్య రాజు నాయక్ పై ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని వీడియోస్ కాలనీకి చెందిన వివాహితకు భర్తతో విభేదాలు ఏర్పడ్డాయి. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తన భర్త తో విభేదాలు ఉన్నాయని వారి నుంచి తనను కాపాడి సమస్య పరిష్కరించాలంటూ మూడేళ్ల క్రితం ఆమె నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఆ సమయంలో సిఐగా విధులు నిర్వహిస్తున్న రాజునాయక్ ఆమెను ప్రలోభాలకు గురిచేశాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదులో తన సెల్ నెంబర్ ఉండటంతో తరచూ ఆమెకు ఫోన్ చేసి న్యాయం చేస్తానంటూ మాటలు కలిపాడు. నిత్యం ఫోన్ చేయడమే కాకుండా మెసేజ్లు చేస్తూ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. అలా కొంతకాలం సహజీవనం చేశారు. ఆమె గర్భవతి కావడంతో పెళ్లి చేసుకోవాలని రాజు పై ఒత్తిడి చేసింది. అందుకు రాజు తిరస్కరించడంతో ఈ నెల ఏడో తేదీన టూ టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. తనను మోసం చేయటమే కాకుండా గర్భవతిని చేశాడని గర్భాన్ని తొలగించేందుకు టాబ్లెట్ ఇచ్చి అబార్షన్ చేశాడని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. శారీరకంగానే కాకుండా ఆర్థికంగా కూడా మోసం చేశాడు అంటూ ఆరోపణలు చేసింది. సదరు రాజు ఇటీవల వరకు ఖమ్మం సెంట్రల్ క్రైమ్ పోలీస్ స్టేషన్లో సిఐగా విధులు నిర్వహి స్తుండగా వివాహితను మోసం చేసిన విషయం వెలుగులోకి రావడంతో సెలవు పై పరారయ్యాడు. ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. దీనిని సీరియస్ గా తీసుకున్న జిల్లా ఉన్నతాధికారులు సిఐ రాజును ఐజి కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఖమ్మం టౌన్ ఏసిపి రమణమూర్తి తెలిపారు.

## ,"తిరుమల వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖ బిల్డర్ మారం వెంకటేశ్వరరావు"



తాడేపల్లిగూడెం మే 19 (అవినాష్ మారంపూడి నేటి- శు భోదయ):::తాడేపల్లిగూడెం ప్రముఖ వ్యాపారవేత్త, బిల్డర్, ఆర్యవైశ్య సంఘ గౌరవ అధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు మంగళవారం తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ సమేతంగా వెంకటేశ్వర స్వామి సన్నిధిలో స్వామివారిని దర్శించుకుని ఆనందంగా గడపటం మరువలేనిదని ఆయన తెలిపారు. వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం మాకు ఆనవాయితీగా వస్తుందని స్వామివారిని దర్శించుకొని కుటుంబంతో గడపడం పూర్వజన్మ సుకృతం అని ఆయన తెలిపారు. ఆయన వెంట ఆయన కుమారులు మారం గిరీష్ గుప్తా, మారం హరీష్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మ నోట్లు కాదు అవి దొంగ నోట్లు - లేపాక్షి లో బయటపడుతున్న నకిలీ నోట్లు

దొంగనోట్ల కేసులో కొత్త ట్విస్ట్‌లు - పెరుగుతున్న అనుమానాలు




లేపాక్షి, నేటి శుభోదయ ::: లేపాక్షి మండలంలో వెలుగులోకి వచ్చిన దొంగనోట్ల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతూ జిల్లావ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది. మొదట భారీగా నకిలీ నోట్లు పట్టుబడ్డాయనే ప్రచారం జరగ్గా, ఐదు రోజుల మౌనం తర్వాత పోలీసులు దీనిని కేవలం "టాయ్ నోట్లు" (ఆటబొమ్మల నోట్లు) గా తేల్చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేసు తీవ్రతను తగ్గించి, ప్రధాన సూత్రధారులను కాపాడేందుకే పోలీసులు ఇలా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. --- పోలీసుల కథనంలోవైరుధ్యాలు-వాహనాల మార్పు నిందితులను అదుపులోకి తీసుకున్న సమయంలో ఇన్నోవా వాహనం వీడియోల్లో కనిపించగా, ప్రెస్‌మీట్ నాటికి అది స్కార్పియోగా మారిపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.-- తీవ్రమైన కేసు తేలికపాటి సెక్షన్లు దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం చేకూర్చే దొంగనోట్ల కేసులో కఠిన సెక్షన్లు పెట్టకుండా, నిందితులకు స్టేషన్ బెయిల్ వచ్చేలా కేసును బలహీనపరిచారనే విమర్శలు వస్తున్నాయి.- పోలీసు సామగ్రి లభ్యం నిందితుల వద్ద నుంచి పోలీసు యూనిఫామ్‌లు, లాఠీలు, బేడీలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులే స్వయంగా ప్రకటించారు. ఇంతటి తీవ్రమైన నేర చరిత్ర ఆధారాలు దొరికినా కఠిన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.- పరారీలో సూత్రధారి ప్రధాన సూత్రధారి కోసం గాలింపు జరుగుతోందని చెబుతూనే, లభించిన మిగిలిన నిందితులను విడుదల చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాత నేరస్థులకు కూడా గతంలో ఒక కేసు విషయం లో సులభంగా ఊరట లభించడం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంత మంది రాజకీయ నాయకుల అనుచరులు ఉన్నారనే ప్రచారం ఈ కేసుకు రాజకీయ రంగు పులిమింది- బ్యాంకులో నకిలీ నోట్ల కలకలం - పోలీసుల వాదనపై ప్రశ్నలు- లేపాక్షి బ్యాంకుల్లో నకిలీ నోట్లు లేపాక్షి మండలంలోని గ్రామీణ బ్యాంకులో మహిళా సంఘాల సభ్యులు డిపాజిట్ చేసిన నగదులో నకిలీ నోట్లు బయటపడ్డాయి. బ్యాంకు అధికారులు ఆ నోట్లపై ' ఫేక్ ' అని ముద్ర వేయడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు.బ్యాంకుల్లోనే నకిలీ నోట్లు బయటపడుతుంటే, పోలీసులు మాత్రం ఇవన్నీ కేవలం "టాయ్ నోట్లు" అని కొట్టిపారేయడంపై ప్రజలు మండిపడుతున్నారు.దేశద్రోహంగా పరిగణించాల్సిన దొంగనోట్ల చలామణి కేసును, భారీగా ముడుపులు చేతులు మారడం వల్లే పోలీసులు కేవలం "టాయ్ నోట్ల మోసం"గా మార్చేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయ ఒత్తిళ్లకు లొంగి కేసు దిశను మార్చేశారనే విమర్శలతో ప్రస్తుతం ఈ వ్యవహారం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

# యవ్వన బాలిక సంరక్షణ అందరి భాద్యత

**- కౌమార బాలికల్లో రక్తహీనత లేకుండా చూడాలి : డి ఎం హెచ్ ఓ రామారావు**



ఖమ్మం, నేటి శుభోదయ ::: యవ్వనదశ లో ఉన్న ఆడపిల్లలను సంరక్షించుకోవాల్సిన భాద్యత సమాజంపైన ఎంతైనా ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి రామారావు పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక వెంకటేశ్వరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్లో మెప్మా పరిధిలో పనిచేస్తున్న సెల్ఫ్ స్వయం సహాయక సంఘాల బాధ్యుల యవ్వన బాలికలు, తల్లిదండ్రులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బాల్యదశ నుండి కౌమరదశ కు మధ్యలో ఆడపిల్లల్లో అనేక మార్పులు జరుగుతాయని వాటిని గుర్తించి తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రస్తుతం బాలికలు డైటింగ్ పేరుతో సమతుల్య ఆహారం తీసుకోవడం లేదని దీనివల్ల అనేక రకమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. దశకు చేరిన పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి కదలికల్లో అవయవాల్లో జరిగే మార్పులను గుర్తించి తగిన రీతిగా వారికి అవసరమైన సూచనలు సలహాలు ఇస్తూ ఏపీ 26 ఎదుగుదలకు కృషి చేయాలని కోరారు స్నాక్స్ పేరుతో తినేది మొత్తం విశాహారమని ఇంట్లో దొరికే ప్రకృతి సిద్ధంగా దొరికే వాటిలోనే బెల్లం పల్లీలు ఆకుకూరలు సరసమైన ధరలకు దొరికే పళ్ళు వంటివి తీసుకొని సంపూర్ణ ఆరోగ్య పంతులుగా తయారు కావాలని సూచించారు. డాక్టర్ ఐ దేవిశ్రీ మాట్లాడుతూ యుక్తవయస్సు వచ్చిన ఆడపిల్లల ఆరోగ్యశీ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని కోరారు. ముఖ్యంగా బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానమన్నారు. మెప్మా టి ఎం సి వి సుజాత మాట్లాడుతూ మెప్మా లో పనిచేస్తున్న సిబ్బంది పిల్లలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ దివాకర ఐఏఎస్ కు జిల్లా వైదధికారి డాక్టర్ డి రామారవు కు కార్యక్రమం నిర్వహించిన డాక్టర్ దేవిశ్రీ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సూపర్ వైజర్ జడ్ ఎస్ జయపాల్, సి ఓ జి ఉపేంద్ర, ఫార్మాసిస్ట్ ముదసర్, స్టాఫ్ నర్సులు హసీనా, షమీమ్ ఏ ఎం ఎం లు కావ్య, రహీంబీ, సంధ్య, శారద తదితరులు పాల్గొన్నారు.

**- హెచ్ పి వి వ్యాక్సిన్ వేయించండి**

ప్రస్తుతం 15 ఏళ్ల లోపు పిల్లలకు ప్రభుత్వం ఇస్తున్న టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు మహిళల్లో అధికంగా వచ్చే సర్వికెల్ క్యాన్సర్ వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తీసుకుందనివివరిస్తూ ప్రతి బాలికకు టీకాను ఇప్పించి నూరుశాతం ఫలితం సాధించేందుకు ప్రతీఒక్కరు కృషిచేయాలనీ కోరారు.

# అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలి

**- హౌసింగ్ సొసైటీ కి 23 ఎకరాల స్థలాన్ని అప్పగించాలి**

**- జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న జర్నలిస్టులకు తీరని అన్యాయం**



ఖమ్మం, నేటి శుభోదయ ::: జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణి జర్నలిస్టు వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని, గత ప్రభుత్వం క్యాబినెట్ లో 23.2 ఎకరాల భూమిని ఖమ్మం జర్నలిస్టులకు కేటాయిస్తూ జీవో జారీ చేశారని , కానీ వాటిని అమలు చేయడంలో నేటి పాలక పక్షాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టీజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ నుంచి మయూరి సెంటర్ మీదుగా అమరవీరుల స్తూపం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద జర్నలిస్టులు నివాళులు అర్పించిన అనంతరం జరిగిన సభలో టి యు డబ్ల్యూ జె (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిశీలిస్తామని అనేక వాగ్దానాలు చేసిన నేటి పాలకులు అధికారంలోకి వచ్చాక జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ద్వంద వైఖరి అవలంబించడం బాధాకరం అన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా జర్నలిస్టులకు కేటాయించిన 23.2 ఎకరాల భూమిని హౌసింగ్ సొసైటీ ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో కాలయాపన చేయడం మంచిది కాదన్నారు. ఈనెల 21న జరిగే క్యాబినెట్ సమావేశంలో సరైన నిర్ణయం తీసుకొని జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు వచ్చే విధంగా ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనేక చీకటి జీవోలు జారీ చేస్తూ కోత విధించే విధంగా వ్యవహరించడం సరైంది కాదు అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు రామిశెట్టి విజేత, జిల్లా ఉపాధ్యక్షులు మంజుల ఉపేందర్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కీ గోపి, నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా వీడియో గ్రాఫర్స్ అధ్యక్షులు నాగరాజు,ఎలక్ట్రానిక్ మీడియా నగర కార్యదర్శి కె .అశోక్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పానకాలరావు, ముత్యాల కోటేశ్వరరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను ,మూల జీవన్ రెడ్డి, నాయకులు మురళి, నరేష్, నల్లమోతు శ్రీను, ఉల్లోజు రమేష్, జక్కుల వెంకటరమణ, హుస్సేన్, ఈసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, శ్రీధర్, ఎన్ రమేష్, సాయి, రామకృష్ణ, తోట గణేష్, పెంటి వెంకటేశ్వర్లు, ఉత్కంఠం శ్రీనివాస్, మహిళ జర్నలిస్ట్ రోజా, రవీందర్ ,నాయుడు, వేణుగోపాల్, శేఖర్, మధు, సుధాకర్, బాబు, లింగయ్య, సతీష్ ,మహేష్, నరసింహారావు, నాగేశ్వరరావు, గుండు శ్రీను, వెంకటేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# వాసిని వీరయ్య మృతి బాధాకరం

**- తుదిశ్వాస వరకు ప్రజల కోసం పనిచేసిన అమరులకు ఆదర్శంగా ఉద్యమాలు నిర్మించాలి - వాసిని వీరయ్య పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్**



జూలూరుపాడు, నేటి శుభోదయ ::: కాకర్ల సీపీఐ సీనియర్ నాయకులు, వాసిని వీరయ్య మృతి బాధాకరం అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ అన్నారు. కాకర్ల గ్రామంలో వాసిని వీరయ్య పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాప, సానుభూతి తలిపారు. ఆయన మాట్లాడుతూ తుదిశ్వాస వరకు ప్రజలకోసం పనిచేసిన అమరుల ఆదర్శంగా ప్రజాసమస్యలుపై ఉద్యమాలు నిర్మించాలినీ అన్నారు. వాసిని వీరయ్య లేని లోటు కుటుంబానికే కాక పార్టీ కూడా తీరని లోటు అని అన్నారు. పార్టీలో అనేక సేవలు అందించారని గుర్తుచేశారు. త్యాగదనులు అందించిన ఎర్రజెండాని కాకర్ల ప్రాంతంలో సగర్వాంగా నిలబెడదానీ, కుటుంబ సభ్యులకు అండగా కమ్యూనిస్టు పార్టీ ఉంటుందని తెలిపారు. నివాళులర్పించినవారు కాకర్ల గ్రామ శాఖ కార్యదర్శి చిమాట ముత్తయ్య, ఉదరి నాగయ్య, బెజవాడ సీతయ్య, కంపసాటి నాగేశ్వరరావు, ముత్తిలింగం, బెజవాడ వెంకటేశ్వర్లు తదితరులు నివాళులర్పించారు.

# పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శం కావాలి

**- సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను**



తిరుమలాయపాలెం, నేటి శుభోదయ ::: ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పేర్కొన్నారు. మంగళవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో గజ్జల వెంకటయ్య భవన్ లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి పిండిప్రోలు, బచ్చోడ్, హైదర్ సాయి పేట, సుబ్లేడ్ తదితర గ్రామాల్లో వర్ధంతి సభలు నిర్వహించడం జరిగింది. ముందుగా సుందరయ్య చిత్రపటాలకు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కొమ్ము శ్రీను మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పోరాడి తమ జీవితాన్ని అంకితం ఇచ్చిన మహనీయుడని పార్లమెంటు లో ప్రజల హక్కుల కోసం మాట్లాడి సైకిల్ పై వెళ్లేవాడని తెలిపారు . పేదలకు వ్యవసాయ కార్మిక సంఘం ఉండాలని సంఘాన్ని స్థాపించాడని కుల వివక్షత అంతరాలు పోవాలని ఏర్పాటు చేశాడని సుందర రామిరెడ్డి పేరును మార్చి రెడ్డిని తీసేశాడని పిల్లలు ఉంటే స్వార్థం పెరిగిద్దని పిల్లలు లేకుండా ఆపరేషన్ చేయించుకుని ప్రజలే నా పిల్లలని జీవితాన్ని త్యాగం చేశాడని ఆయన కొనియాడారు. భూస్వామి కుటుంబంలో పుట్టిన పేద వర్గాల కోసం పనిచేసిన మహనీయుడని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొలిచలం స్వామి, నెరుసుల వెంకటేష్, పప్పుల ప్రసాద్, దొండేటి నిర్మల్ రావు, చల్లా వెంకటేశ్వర్లు, సర్పంచ్ కామల్ల సువార్త, గుండెపుడి సోమన్న, పోలేబోయిన ముత్తయ్య, కొమ్ము నాగేశ్వరరావు, వెంకన్న, మస్తాన్, పప్పుల ఉపేందర్, దొండేటి నిర్మల్ రావు, పప్పుల ప్రసాద్, పిట్టల పాపారావు, రామనబోయిన రవి, పప్పుల చిన్న ఉపేందర్, కామల్ల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# సిరికొండలో నేటి నుంచి వీఓఏల సమ్మె

**కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని**



(నిజామాబాద్ రూరల్ సిరికొండ నేటి శుభోదయ ప్రతినిధి రాజు) సిరికొండలో నేటి నుంచి వీఓఏల సమ్మె తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సిరికొండ మండలంలో వీఓఏలు సమ్మె బాట పట్టారు. సిరికొండ మండల కేంద్రంలో వీఓఏల అధ్యక్షుడు మూన్ సింగ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సై రామకృష్ణ, ఎంపీడీవో, ఏపీఎంలకు సమ్మె నోటీసులు అందజేశారు. 58 జీవోను ఎత్తివేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని వర్తింపజేయాలని, అర్హులైన వీవోఏలను గుర్తించి సీసీలుగా పదోన్నతి కల్పించాలని, రూ.20 లక్షల బీమా వర్తింపజేయాలని, గ్రామాల్లో ఉచిత ట్యాబ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, ఐడీ కార్డులు జారీ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

# ఉద్యమ బిడ్డ కవితమ్మ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ లో బేకరీ రాజు 100 మందితో చేరిక



( నేటి శుభోదయ మహేశ్వరం మే 19:)తెలంగాణ రక్షణ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పాండురంగారెడ్డి, టిఆర్ఎస్ జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు శివకుమార్, ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బిఆర్ఎస్ చెందిన నాయకులు 100 మంది టిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అమ్మ టిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు ,బేగరి రాజు కాంగ్రెస్ పార్టీ ,యండి అన్వార్ ఖాన్. కాంగ్రెస్ పార్టీ ,మేకగూడెం బిక్షపతి కాంగ్రెస్ పార్టీ ,షేక్ మహమ్మద్ నూర్ భాయ్ కాంగ్రెస్ పార్టీ చాకలి విక్రమ్ బీజేపీ ,బొక్క సురేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ , బొక్క రవీందర్ రెడ్డి. బిఆర్ఎస్ పార్టీ, కావలి శ్రీనివాస్ ముదిరాజ్. కాంగ్రెస్ పార్టీ, చాకలి వినోద్ కుమార్ కాంగ్రెస్ పార్టీ, ఎండి ఇనుస్ కాంగ్రెస్ పార్టీ, మాలని రాజు కాంగ్రెస్ పార్టీ, గాండ్ల సంతోష్ బిఆర్ఎస్ పార్టీ , కుమ్మరి జనార్దన్ బిఆర్ఎస్ పార్టీ , బోడ భాస్కర్ కాంగ్రెస్ పార్టీ , మంగలి శివ, ఎండి వినాయక్ ,ఎండి అలీ ,ఎండి ఏయ్యా,శ్రీకాంత్ తదితరులుపాల్గొన్నారు,చాకలి విక్రమ్ బీజేపీ ,బొక్క సురేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ , బొక్క రవీందర్ రెడ్డి. బిఆర్ఎస్ పార్టీ , కావలి శ్రీనివాస్ ముదిరాజ్. కాంగ్రెస్ పార్టీ, చాకలి వినోద్ కుమార్ కాంగ్రెస్ పార్టీ, ఎండి ఇనుస్ కాంగ్రెస్ పార్టీ, మాలని రాజు కాంగ్రెస్ పార్టీ , గాండ్ల సంతోష్ బిఆర్ఎస్ పార్టీ, కుమ్మరి జనార్దన్ బిఆర్ఎస్ పార్టీ , బోడ భాస్కర్ కాంగ్రెస్ పార్టీ , మంగలి శివ,, ఎండి వినాయక్,ఎండి అలీ,ఎండి ఏయ్యా ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# టీఎస్ ఆర్ జె సి ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులతో త్రివేణి కి అగ్రస్థానం



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఇటీవల విడుదలైన టీఎస్ ఆర్ జె సి ఫలితాల్లో ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. ఈ ఫలితాల్లో సి హెచ్ సాయి దీక్షిత్ 117 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 21 వ ర్యాంక్, కె రిషిత 111 మార్కులతో 27 వ ర్యాంక్ , బి హరిచందన 110 మార్కులతో 32 వ ర్యాంక్, హర్షవర్ధన్ 112 మార్కులతో 38 వ ర్యాంక్,దేవి వెంకట సాయి 110 మార్కులతో 46 వ ర్యాంక్, 100 ర్యాంక్ ల లోపు 10 మంది విద్యార్థులు, 1000 ర్యాంక్ ల లోపు 16 మంది సాధించి త్రివేణి ని మరొక్కసారి అగ్రపధాన నిలిపారు.ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలను సాధించడం త్రివేణి విద్యార్థులకు అలవాటని, అది సాధారణంగా జరిగే విషయమేనని ఆయన అన్నారు. అదేవిధంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కేవలం ఎస్ఎస్సి ఫలితాల్లోనే కాదు ఏ పోటీ పరీక్షల్లో అయినా త్రివేణి విద్యార్థులు ముందంజలోనే ఉంటారని అన్నారు. విజయం సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పటిష్ట ప్రణాళికా బోధనతో పాటు,ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడం వలన ఈ ర్యాంకులు సాధించడం జరిగిందని, దీని పట్ల త్రివేణి యాజమాన్యానికి ,ఉపాధ్యాయ బృందానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ ,పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యులపై వేధింపులు ఆపాలి

**అశ్వారావుపేట ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన..**

**ఆర్ఎంపీ--పీఎంపీ సిపి ఈ పి సంఘం నాయకుల వినతి...**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 19,( నేటి శుభోదయ ),భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రామీణ వైద్యులపై జరుగుతున్న రైడింగ్‌లు, జరిమానాలను నిలిపివేయాలని టీఎస్ ఆర్ఎంపి పిఎంపి సి పి, ఈపీ సంఘం నాయకులు సోమవారం నాడు అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ ను నియోజవర్గ కేంద్రంలో కలిసి వినతి పత్రం ఇచ్చి కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్ శశికళ, వైస్ చైర్‌పర్సన్ జూపల్లి రమేష్‌లను కూడా సంఘ నాయకులు కలిసి సమస్యలను వివరించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యవరపు జగదీష్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పి. వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి టి. రామదాసు, జిల్లా ఖజాంచి టి. కృష్ణతో పాటు జిల్లా, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రాత్రింబవళ్లు ప్రజలకు ప్రథమ చికిత్స అందిస్తూ అవసరమైతే ప్రభుత్వ ఆసుపత్రులకు రోగులను రిఫర్ చేస్తున్నామని తెలిపారు. తమ పరిధి దాటి వైద్యం చేయవద్దని సూచిస్తే తప్పకుండా పాటిస్తామని చెప్పారు. పెద్ద కేసులను ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.పల్స్ పోలియో వంటి ప్రభుత్వ వైద్య కార్యక్రమాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలను భాగస్వామ్యం చేయాలని కోరారు. మెడికల్ అధికారులు వచ్చినప్పుడు పూర్తి సహకారం అందిస్తామని, మొదటిసారి సూచనలు ఇచ్చి, అదే తప్పు పునరావృతమైతే మాత్రమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# గ్రామ అభివృద్ధి కొరకు కలెక్టర్ కి వినతి పత్రం అందజేసిన సర్పంచ్ ఆర్మీ రవి



తిరుమలాయపాలెం, నేటి శుభోదయ ::: తిరుమలాయపాలెం మండల పరిధిలోని సుద్దవాగు తండా గ్రామపంచాయతీ ముజాహితీపురం గ్రామాల అభివృద్ధి పనుల కొరకు మంగళవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో శుద్ధ వాగు తండా సర్పంచ్ ఆర్మీ రవి, గ్రామ ప్రజలు కలెక్టర్ దివాకర టిఎస్ కలిసి గ్రామ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ త్వరలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారని ఆర్మీ రవి తెలిపారు. శుద్ధ వాగు తండా గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాల పరిశీలన నిమిత్తం ఎంపీడీవో సిలార్ సాహెబ్ గ్రామంలో పర్యటించి అభివృద్ధి పనులను పర్యవేక్షించారు.

# బాలినేనికి బెర్త్ ఖరారు ఒంగోలు వదిలి అక్కడి నుంచి పోటీ

అమరావతి, ఒంగోలు, నేటి శుభోదయ ::: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. వైసీపీని వీడి జనసేన గూటికి చేరిన సీనియర్ నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి రాజకీయ భవిష్యత్తుపై క్లారిటీ వచ్చేసినట్లే కనిపిస్తోంది.ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో బాలినేని జరిపిన భేటీ ఇటు కూటమిలోనూ, అటు ప్రకాశం జిల్లా రాజకీయాల్లోనూ పెను సంచలనంగా మారింది.ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయాల్లో 'ఒంగోలు టైగర్'గా పేరుగాంచిన బాలినేని శ్రీనివాసరెడ్డి రూట్ మారుస్తున్నారు. జనసేనలో చేరిన తర్వాత తొలిసారి ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... బాలినేనికి రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు క్లియరెన్స్ వచ్చేసిందని టాక్. అయితే, ఆయన తన సొంత గడ్డ అయిన ఒంగోలును వీడి, దర్శి నియోజకవర్గం నుంచి బరిలోకి దిగబోతున్నట్లు గట్టిగా ప్రచారం సాగుతోంది.

**- దర్శి వైపు చూపు**

కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా త్వరలోనే దర్శి నియోజకవర్గాన్ని జనసేనకు అప్పగించేందుకు టీడీపీ అధిష్టానం సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. మాజీ విద్యుత్ శాఖ మంత్రి అయిన బాలినేనిని దర్శికి పంపడం ద్వారా అక్కడ కూటమి జెండాను మరింత బలంగా పాతవచ్చనేది అధిష్టానం ఆలోచన. దీనిపై ఇప్పటికే టీడీపీ-జనసేన అగ్రనాయకత్వాల మధ్య సూత్రప్రాయంగా ఒక అవగాహన కుదిరినట్లు సమాచారం.2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభవాన్ని చవి చూసినా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రెండు స్థానాలను మాత్రం గెలుచుకుంది. యర్రగొండపాలెం రిజర్వ్ సీటు కాబట్టి దర్శిపై పట్టు సాధించి వైసీపీకి చెక్ పెట్టాలని ప్లాన్ కూటమి నేతల్లో ఉంది. కాగా దర్శి సీటును వైసీపీ కూడా చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రస్తుతం అక్కడ వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పార్టీ బాధ్యతలు బాగానే చూసుకుంటున్నారనే విశ్లేషకులు అంటున్నారు.



**- తెలుగు తమ్ముళ్లలో గందరగోళం**

దశాబ్దాలుగా దర్శిలో పార్టీ కోసం పనిచేస్తున్న టీడీపీ స్థానిక నాయకత్వానికి ఈ పరిణామం మింగుడుపడటం లేదు. బాలినేని వంటి సీనియర్ నేత హఠాత్తుగా తమ నియోజకవర్గానికి వస్తారనే ప్రచారంతో స్థానిక 'తెలుగు తమ్ముళ్లు' తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. అయితే ప్రస్తుతం అక్కడ టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన గొట్టిపాటి లక్ష్మీ ఇన్చార్జ్ గా ఉన్నారు. ఆమె పనితీరు పట్ల కొంతమంది నేతలు అసంతృప్తితో ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**- వెనుక ఉన్న ఆ 'ఒంగోలు సీనియర్' ఎవరు**

బాలినేనిని ఒంగోలు నుంచి దర్శికి షిఫ్ట్ చేయడం వెనుక ప్రకాశం జిల్లాకు చెందిన ఒక సీనియర్ నేత చక్రం తిప్పినట్లు రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒంగోలు నియోజకవర్గంపై తన పట్టును నిలబెట్టుకోవడానికి, అక్కడ బాలినేని లాంటి బలమైన నేత ఉంటే భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని భావించే సదరు సీనియర్ నేత ఈ వ్యూహాన్ని అమలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. బాలినేనిని దర్శికి పంపడం ద్వారా ఒంగోలులో తన ఆధిపత్యాన్ని శాశ్వతం చేసుకోవాలనేది ఆ నేత ప్లాన్‌గా కనిపిస్తోంది.

**- బాలినేని ఒక సుదీర్ఘ రాజకీయ ప్రయాణం**

బాలినేని శ్రీనివాసరెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రకాశం జిల్లా చరిత్రతో ముడిపడి ఉంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి అత్యంత ఆప్తుడిగా, బంధువుగా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన బాలినేని, ఒంగోలు నియోజకవర్గాన్ని తన కోటగా మార్చుకున్నారు. వైఎస్సార్ హయాంలో కాంగ్రెస్ పార్టీ ద్వారా ఒంగోలు ఎమ్మెల్యేగా విజయం సాధించి, వైఎస్సార్ క్యాబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.వైఎస్సార్ మరణం తర్వాత జగన్ మోహన్ రెడ్డి కోసం మంత్రి పదవిని, కాంగ్రెస్ పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసిపి) స్థాపనలో కీలక భూమిక పోషించారు. ఒంగోలులో వరుస విజయాలతో జిల్లాలోనే తిరుగులేని నేతగా ఎదిగారు. 2019 వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్, అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా పనిచేశారు. జిల్లా రాజకీయాలను ఒంటిచేత్తో నడిపించారు. జగన్ రెండో సారి మంత్రి వర్గ విస్తరణ సమయంలో అధిష్టానంతో పెరిగిన గ్యాప్ తో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. చివరకు వైసీపీకి గుడ్ బై చెప్పి పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన కండువా కప్పుకున్నారు.

**- దర్శిలో 'వాసు' మార్క్ సాధ్యమేనా**

ఒంగోలు గడ్డపై ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రికార్డు బాలినేని సొంతం. అలాంటి నేత ఇప్పుడు పూర్తిగా కొత్త నియోజకవర్గమైన దర్శిలో అడుగుపెట్టి.. సామాజిక సమీకరణాలు, స్థానిక టీడీపీ నేతల అసంతృప్తిని తట్టుకుని.. తన మార్క్ రాజకీయాన్ని ఎలా చూపిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా, చంద్రబాబు-బాలినేని భేటీతో ప్రకాశం జిల్లా కూటమి రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలైందని చెప్పక తప్పదు. భవిష్యత్తులో ఈ సమీకరణాలు ఎలాంటి మలుపులు తిరుగుతాయో చూడాలి.

# జంతువుల నుంచి మనుషులకు ఏటా 5 కొత్త వ్యాధులు..!



సృష్టిలో ప్రతి జీవరాశి తన మనుగడను కొనసాగించడానికి శక్తి అత్యవసరం. ఈ శక్తి ప్రధానంగా ఆహారం ద్వారానే లభిస్తుంది. ముఖ్యంగా మానవాళికి అవసరమైన పోషకాలు పంటలు, పశుసంపద ద్వారా లభించే ఆహార పదార్థాలపై ఆధారపడి ఉంటాయి. పశువైద్యులు కేవలం జంతువులకు చికిత్స చేసే వైద్యులు మాత్రమే కాదు. ఆహార భద్రతకు రక్షకులు కూడా. ఆరోగ్యదాయక పశుపోషణ ద్వారా ప్రజారోగ్యాన్ని, పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్నారు. 'పశు వైద్యులు-- ఆహార ఆరోగ్య సంరక్షకులు' అనే థీమ్‌తో ఈ సంవత్సరం ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని జరుపుకోవటం అత్యంత సముచితం. పశు సంపద ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుంది. పెరుగుతున్న జనాభా, మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న పోషక అవసరాల నేపథ్యంలో పశు వైద్య రంగం ప్రాముఖ్యత మరింత పెరుగుతోంది. మన పూర్వీకులు పశువులను, ప్రకృతిని సమానంగా గౌరవించి, పర్యావరణహితమైన విధానాలతో వ్యవసాయం, జీవన విధానాన్ని అభివృద్ధి చేశారు. ఈ సమతుల్య జీవన విధానాన్ని మళ్లీ ఆచరిస్తే, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సుస్థిరమైన జీవితం అందించవచ్చు.

## ఆరోగ్యంపై సమగ్ర దృక్పథం

పశువైద్యం కేవలం జంతువుల వైద్యంతో పరిమితం కాకుండా.. మనుషుల ఆరోగ్యం, పశువుల ఆరోగ్యం, పర్యావరణ ఆరోగ్యం వేర్వేరు కాదు అంతా ఒక్కటే (వన్ హెల్త్) అనే సమగ్ర విధానాన్ని అనుసరిస్తుంది. ఈ మూడూ పరస్పరం అనుసంధానమైనవి. పశు వైద్యులు పశువుల ఆరోగ్యాన్ని మాత్రమే కాపాడటమే కాకుండా పరోక్షంగా ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తున్నారు. ముఖ్యంగా ఆహారంగా ఉపయోగించే పశువులకు చికిత్స ఇచ్చేటప్పుడు మందుల అవశేషాలు పాలు, మాంసం, గుడ్లు వంటి ఆహార పదార్థాలలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత కీలకం.

## సంక్రమిత వ్యాధుల నియంత్రణ

పశువుల నుండి మనుషులకు, అలాగే మనుషుల నుండి పశువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారు. ఉదాహరణకు: రేబీస్, బ్రూసెల్లోసిస్, టీబీ వంటివి. ప్రస్తుతం గుర్తించిన సంక్రమిత వ్యాధులలో సుమారు 60% జంతువుల ద్వారా వ్యాపిస్తున్నాయి. ప్రతి సంవత్సరం కనీసం 5 కొత్త వ్యాధులు జంతువుల నుండి మనుషులకు వస్తున్నాయని అంచనా. అరణ్య ప్రాంతాలలో మానవ జోక్యం పెరగటం ఈ వ్యాధుల వ్యాప్తికి ముఖ్య కారణం. ఈ నేపథ్యంలో పశువైద్యులు ఆధునిక సాంకేతిక పద్ధతులతో వ్యాధులను ముందుగానే గుర్తించి నియంత్రించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

## యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) ప్రపంచ ఆరోగ్యానికి అత్యంత పెద్ద సవాళ్లలో ఒకటి. అనవసరంగా, అధికంగా యాంటీ బయోటిక్స్ వాడటం వల్ల మందుల ప్రభావం తగ్గుతుంది. ఆహారంలో అవశేషాలు చేరి ప్రజారోగ్యానికి హాని కలుగుతుంది. ఈ సమస్యను నివారించడానికి పశువైద్యులు బాధ్యతాయుతమైన ఔషధ వినియోగాన్ని ప్రోత్సహించాలి. పశుసంపద సుస్థిర ఆహార భద్రతలో కీలకపాత్ర పోషిస్తోంది. ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) అంచనాలప్రకారం, ప్రపంచానికి అవసరమైన ప్రోటీన్‌లో సుమారు 30--40% జంతువుల నుంచి లభిస్తుంది. అయితే, ప్రతి సంవత్సరం సుమారు 20% ఆహారం పశువ్యాధుల వల్ల కోల్పోతున్నాం. పశువుల విసర్జితాల పునర్వినియోగం ద్వారా సేంద్రియ వ్యవసాయం, గోఆధారిత వ్యవసాయం వర్థిల్లుతుంది. తద్వారా పర్యావరణం, పశువులు, మనుషుల మధ్య సమన్వయంతో ఆహార గొలుసును కాపాడుకోవచ్చు.

## 14.5% వరకు పశువుల ఉద్గారాలు

ప్రస్తుతం పశువైద్య రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు వాతావరణ మార్పు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 14.5% హరిత గృహ ఉద్గార వాయువులు పశుసంపద నుంచి వెలువడుతున్నాయని అంచనా. దీర్ఘకాలిక సగటు ప్రపంచ ఉష్ణోగ్రత 1 డిగ్రీల సెల్షియస్ పెరిగితే 10--15% వరకు పశువుల పెరుగుదల, వ్యవసాయోత్పత్తి తగ్గుతుంది. అయితే, పశుసంపద మనకు ముఖ్యమైన ప్రోటీన్ వనరుగా కూడా ఉంది. ఈ పరిస్థితుల్లో పశువైద్యులు మీథేన్ ఉద్గారాలను తగ్గించే పద్ధతులు, సుస్థిర పశుసంవర్ధన విధానాలు, కార్బన్ క్రెడిట్ అవకాశాలపై దృష్టి సారిస్తున్నారు. రైతులకు అదనపు ఆదాయం కల్పించే విధంగా కార్బన్ మార్కెట్‌లో భాగస్వామ్యం కల్పించడం కూడా ఒక ముఖ్య లక్ష్యం.

## మీథేన్ ఉద్గారాలు

ప్రపంచంలో అత్యధిక పశుసంపద కలిగిన దేశం మనదే. ఎఫ్ఏఓ, ఐసీఏఆర్ అంచనాల ప్రకారం భారతదేశంలో మొత్తం హరిత గృహ వాయువు ఉద్గారాల్లో సుమారు 14--16% వ్యవసాయం నుంచి వెలువడుతుంటే, అందులో పశుసంపద ఉద్గారాల వాటా 55--60%. పాల ఉత్పత్తిలో దేశంలోనే ముఖ్య రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఏపీలో వ్యవసాయ ఉద్గారాల్లో పశు సంపద వాటా 30--35%గా ఉంది. ముఖ్యంగా డెయిరీ రంగంలో గేదెల ద్వారా ఎక్కువ మీథేన్ వెలువడుతోందని అంచనా. నెమరు వేసేటప్పుడు జీర్ణప్రక్రియ వల్ల వెలువడే మీథేన్ పశు ఉద్గారాల్లో 85%ను ఆక్రమిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో వెలువడే వ్యవసాయ ఉద్గారాలలో పశుసంపద ఉద్గారాల వాటా 25--30%. తెలంగాణలో గొర్రెలు, మేకల సంఖ్య అధికంగా ఉండటం వల్ల ఉద్గారాల తీరు భిన్నంగాఉంటుంది. తెలంగాణ ఎస్ఏపీసీసీ చెబుతున్న దాని ప్రకారం మీథేన్ ఉద్గారాలు పశువుల నుండే ఎక్కువ వెలువడుతున్నాయి.

## ముఖ్యమైన విశేషాలు

ప్రపంచంలోని అన్ని దేశాల కంటే మన దేశంలో పశుసంపద ఎక్కువ. కానీ తక్కువ. కానీ, ముఖ్యంగా ఒక్కో పశువు తలసరి ఉత్పాదకత తక్కువ. ప్రపంచంలోని గేదెల సంఖ్యలో 50% మన దేశంలోనే ఉంది. ఈ కారణంగా మొత్తం ఉద్గారాలు ఎక్కువగా కనిపిస్తాయి. కానీ పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి క్రమంలో వెలువడే ఉద్గారాలను తగ్గించే అవకాశం ఉంది. పశువైద్యులు కేవలం జంతువుల వైద్యులు మాత్రమే కాదు. ఆహార భద్రతకు రక్షకులు కూడా. ఆరోగ్యదాయక పశుపోషణ ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నారు. పర్యావరణ సమతుల్యతకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. వన్ హెల్త్ దృక్పథంతో పశువైద్యులు సమగ్ర సుస్థిర అభివృద్ధికి మార్గం సుగమం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'పశు వైద్యులు- ఆహార, ఆరోగ్య సంరక్షకులు' అనటంలో ఎంతమాత్రమూ అతిశయోక్తి లేదు.

# ముంచుకొస్తున్న వ్యవసాయ, ఆహార విపత్తు! ఎఫ్ఏఓ ఆందోళన



అత్యవసర వ్యవసాయ ఉత్పాదకాలైన ఎరువుల ఉత్పత్తి కోసం సహజ వాయువును తీసుకువెళ్లే ఓడలను హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించటాన్ని వెంటనే పునఃప్రారంభించకపోతే ప్రపంచ ఆహార ధరలు ఈ ఏడాది చివర్లో విపరీతంగా పెరిగే ముప్పు పొంచి ఉందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) తీవ్రస్వరంతో హెచ్చరిస్తోంది. హార్ముజ్ జలసంధిలో రవాణాకు దీర్ఘకాలిక అంతరాయాలు కోవిడ్--19 అనంతర కాలాన్ని గుర్తుచేసే విధంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను, సరఫరా గొలుసులో ఆటంకాలను ప్రేరేపించగలవని ఎఫ్ఏఓ హెచ్చరించింది. పంటల క్యాలెండర్ల ప్రకారం ఎరువులు, ఇంధన ఉత్పాదకాలు సకాలంలో అందకపోవటం, అధిక ధరల కారణంగా పేద దేశాలు అత్యధిక ప్రమాదంలోకి కూరుకుపోతున్నాయని ఎఫ్ఏఓ ముఖ్య ఆర్థికవేత్త మాక్సిమో టొరెరో ఆందోళన వ్యక్తం చేశారు. ఎఫ్ఏఓ ఆర్థిక విభాగం డైరెక్టర్ డేవిడ్ లాబోర్డ్‌తో కలిసి ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడారు. ముడి చమురు, నత్రజని ఎరువుల తయారీకి ఉపయోగించే సహజ వాయువు, ఇంకా ఇతర ఎరువులు రవాణా కావడం లేదు. ఫాస్ఫేట్ ఎరువుల తయారీకి ఉపయోగించే సల్ఫర్ రవాణా కూడా స్తంభించిందని ఆయన అన్నారు. నౌకలు కదలకపోతే, ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ--ఆహార వ్యవస్థకు, ఆర్థిక వృద్ధికి, ఇంకా అనేక రంగాల రోజువారీ కార్యకలాపాలకు అవసరమైన కీలక వనరులపై గణనీయమైన ప్రభావం పడుతుందని టొరెరో హెచ్చరించారు. రాబోయే రోజుల్లో నౌకలు కదలడం ప్రారంభిస్తాయని ఆశిస్తున్నానన్నారు.

## 'సమయం గడిచిపోతోంది..'

'సమయం గడిచిపోతోంద'ని ఎఫ్ఏఓ ప్రధాన ఆర్థికవేత్త టొరెరో అన్నారు. వ్యవసాయ--ఆహార వ్యవస్థకు సంబంధించిన ప్రతిదీ పంటల క్యాలెండర్‌తో ముడిపడి ఉందని వివరించారు. మనం పంటల క్యాలెండర్‌ను పాటించకపోతే, విత్తనాలు/ నాట్లు వేసే సమయంలో రైతుల దగ్గర పెట్టుబడులు లేక?ోతే తక్కువ పెట్టుబడులతో వ్యవసాయం చేయవలసి వస్తుంది. అందువల్ల రానున్న ఒకటి, రెండు పంటకాలాల్లో దిగుబడులు తగ్గి?ోవచ్చు. అలాగే ఆహారం, నిత్యావసరాల ధరలు పెరిగిపోవచ్చు. ప్రస్తుతం మనం ఈ అత్యవసర పరిస్థితిలో ఉన్నాం. దీనివల్ల వడ్డీ రేట్లు పెరుగుతాయని, అది ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుందన్నారు. కోవిడ్--19 నుండి కోలుకున్న తర్వాత అనుసరించిన విధానాల మాదిరిగానే, అన్ని దేశాలు ధరలను తగ్గించే విధానాలను అమలు చేయాల్సి ఉంటుంది. అందువల్ల, ఈ నౌకలు ఇప్పుడు కదలడం ప్రారంభించడం చాలా ముఖ్యం అని టొరెరో నొక్కి చెప్పారు.

## ఆహార పంటల సాగు తగ్గొచ్చు

ధరల సూచి ఏప్రిల్‌లో పెరుగుతోందని, మేలో అది మరింత తీవ్రమవుతుందని టొరెరో పేర్కొన్నారు. ఎరువుల లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపికలను మార్చుకోవాలా వద్దా? పెరిగిన చమురు ధరలతో ప్రయోజనం పొందడానికి జీవ ఇంధనాల ఉత్పత్తికి అనువైన పంటల సాగుకు ఎక్కువ భూమిని, వనరులను కేటాయించటంపై రైతులు నిర్ణయాలు తీసుకుంటారు. దీని వల్ల ప్రపంచ ఆహార సరఫరా తగ్గిపోతుంది. అందుకే కాల్పుల విరమణ కొనసాగడం, జలసంధిలోని నౌకలు కదలటం అత్యవసరమని అన్నారు. ముఖ్యంగా ఇంధనం, ఎరువులపై ఎగుమతి ఆంక్షలను నివారించాలని ఎఫ్ఏఓ అన్ని దేశాలను కోరింది.

# వృథా కానీ ఎకానమీగా వెదురు.. సాగు ఒక్కటే చాలదు!

వెదురు వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. ఔషధ గుణాల దగ్గరి నుంచి సౌందర్య సాధనాల తయారీలోనూ దీని వినియోగం పెరిగింది. దీంతో భారత్ సహా చాలా దేశాలు సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాయి. అయితే పంటకు ప్రాముఖ్యత ఇచ్చినంత మాత్రన సరిపోదంటున్నారు శాస్త్రవేత్తలు. వెదురు విప్లవం సాగుకే పరిమితం కాకూడదని, దాన్నో ఎకానమీగా మారాలంటే రీసెర్చ్ అవసరమని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ (నీతిఆయోగ్)--×జూ=--నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సీఈవో డాక్టర్ ఆదర్శ గౌడ. మరి అదెలాగో ఆయన మాటల్లోనే సవివరంగా తెలుసుకుందాం.. వెదురు ఇండస్ట్రీని తీసుకురావాలంటే.. కేవలం భావోద్వేగ ప్రచారాలు, హ్యాష్ ట్యాగులు కాదని.. రీసెర్చులు జరిగితేనే ఆ పరిశ్రమలు నిలబడతాయని చెబుతున్నారు ఆదర్శ గౌడ. ఆ అవసరం ఎందుకో ఆయన వివరించారు. ఐరన్ వెదురు షూట్స్‌లోని చేదు రుచి కారణమైన బయో--యాక్టివ్ ఫ్లేవనోయిడ్లు, ఫెనాలిక్ కంపౌండ్లు, ప్రాసెసింగ్ చేయకపోతే హానికరమైన సైనోజెనిక్ గ్లైకోసైడ్లను సూచిస్తుందని చెబుతున్నారాయన. ఈ చేదులో ఆంటీ--డయాబెటిక్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు సాగుతున్నాయని.. రక్తంలో చక్కెర నియంత్రణకు తోడ్పడే ఫంక్షనల్ ఫుడ్‌గా నిలిచే అవకాశాలు ఉన్నప్పటికీ, శాస్త్రీయ ధృవీకరణ, సేఫ్ ప్రాసెసింగ్ కీలకమని ఆయన హెచ్చరించారు. అలాగే ఐరన్ వెదురులో తక్కువ సిలికా కంటెంట్ ఉండటంతో ఎకో--టూరిజం



పార్కులు, వినోద అరణ్యాలు వంటి పర్యావరణ హితమైనవి తీసుకురావొచ్చని అన్నారు. దీంతోపాటు వెదురు ఫైబర్‌తో తయారయ్యే ఎండీఎఫ్ బోర్డులు రైలు మార్గాల సౌండ్ బ్యారియర్లు, భవనాల ఇన్సులేషన్, అకౌస్టిక్ ప్యానెల్స్ వంటి రంగాల్లో భారీ మార్కెట్‌ను ఆకర్షించే సామర్థ్యం ఉందన్నారు. అలాగే వెదురు ఆకులు, కొమ్మలతో తయారయ్యే బయోడిగ్రేడబుల్ ఎగ్ ట్రేస్, ప్లేట్లు, ప్యాకేజింగ్ పల్ప్ ప్లాస్టిక్‌కి అడ్డుకట్ట వెయ్యొచ్చు. పైగా అగ్రికల్చరల్ వ్యర్థాన్ని ఆదాయంగా మార్చే గొనంన అవకాశం కూడా అని అన్నారు. ఆఖరికి వెదురు ఆకులు, కొమ్మలతో తయారయ్యే బయోడిగ్రేడబుల్ ఎగ్ ట్రేస్, ప్లేట్లు, ప్యాకేజింగ్ పల్ప్ ప్లాస్టిక్‌కి అడ్డకట్ట వెయ్యొచ్చని చెప్పారు. అలాగే వెదురు షూట్స్(తినదగిని వెదురు లేత రెమ్మలు) స్నాక్స్‌గా, ఫ్లేవర్, ఫెర్మెంటెడ్ ఫుడ్స్, అలాగే టెక్స్‌టైల్ ఫైబర్లు, పశువుల మేత, మెడికల్ ఎక్స్‌ట్రాక్టుల వరకు దీన్ని విస్తరించవచ్చని చెబుతున్నారు. ఇవన్నీ జరగాలంటే రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ వల్లే సాధ్యమని, ఇది కేవలం ల్యాబ్ కాదని పరిశ్రమకు బ్రెయిన్ లాంటిదని చెబుతున్నారు.

**- ఈ సెంటర్ ద్వారా ఉపయోగాలేంటంటే..**

ఎలాంటి చోట వెదురు పెంచాలో రైతులకు చెప్పడం

ఎలాంటి వెదురు మొక్కలను పెంచాలో రైతులకు సూచనలు ఇవ్వడం..

ఏ పొడక్ట్‌లకు మార్కెట్ సుస్థిరమో ఇన్వెస్టర్లకు క్లారిటీ

ఏ రంగాల్లో సబ్సిడీలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలో ప్రభుత్వానికి గైడ్

స్టాండర్డ్స్, క్వాలిటీ కంట్రోల్, పేటెంటబుల్ ఇన్నొవేషన్లు సిస్టమాటిక్‌గా బయటకు రావడం

అంతేగాదు ఈ ఆర్ అండ్ డీ సెంటర్ వల్ల నేరుగా ఇంజినీర్లు, టెక్నీషియన్లు, ప్రోడక్ట్ డెవలపర్లు, డేటా అనలిస్టులకు ఉద్యోగాలు వస్తాయని, పక్కనే రైతులు, ఇండస్ట్రీ వర్కర్లు, లాజిస్టిక్స్, మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్ రంగాల్లో కూడా కొత్త ఉపాధి అవకాశాలు తెరుచుకుంటాయని తెలిపారు. ఇది "లైవ్‌లీహుడ్ ప్రాజెక్ట్" స్థాయిలో ఉండే వెదురు సాగును, నిజమైన ఆర్థిక రంగంగా మారుస్తుందని డా. గౌడ అభిప్రాయపడ్డారు. అందువల్ల వీటిని సాగు ఒక్కటే భవిష్యత్తు కాదని, మరింత లోతుగా అధ్యయనం చేయడం దాని వాల్యూ తెలుసుకోవడం అత్యంత ముఖ్యమని నొక్కి చెప్పారు. అందువల్ల ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లో వెదురు విప్లవం మొదలైంది. గ్రామీణ సమాజాన్ని పేదరికం నుంచి బయటపడేసే హీరోగా, భూమిని రక్షించే మొక్కగా, అలాగే నిర్మాణ రంగానికి ఆయువు పట్టుగా కీర్తిస్తున్నారు. అలాంటి వెదురు కలప పరిశ్రమ వాస్తవికతలోకి రావాలంటే పరిశోధనల్లో పెట్టుబడులు పెడితేనే సాధ్యమని లేదంటే ప్రచారంగానే మిగిలిపోతుందని హెచ్చరించారాయన.

# మహిళల నీటి కష్టాలు మూడురెట్లు!



ప్రపంచంలో మన దేశానికి ఉన్నది 4% మంచినీరు మాత్రమే. కానీ, ప్రపంచ జనాభాలో 18% మన దేశంలోనే నివశిస్తున్నారు. నీటి కొరత ఇప్పటికే మనకు పెనుసవాలుగా మారింది. ముఖ్యంగా వేసవిలో నీటి చుక్క కోసం అల్లాడే పరిస్థితి చాలా ప్రాంతాల్లో ఉంది. ప్రపంచవ్యాప్తంగా మహిళలు, బాలికలు ప్రతిరోజూ నీటి సేకరణకు 25 కోట్ల గంటలు వెచ్చిస్తున్నారు. ఇది పురుషులు, బాలురు వెచ్చిస్తున్న దాని కంటే 3 రెట్లు ఎక్కువ. నీటి గణాంకాల గురించి సాధారణంగా క్యూబిక్ మీటర్లలో చెబుతూ ఉంటాం. కానీ ఈ ప్రతి సంఖ్య వెనుక ఒక మానవ ముఖం ఉంది. ఆ ముఖం, చాలా సార్లు, మహిళదే! ఇది కల్పన కాదు. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునెస్కో, యూఎన్ ఉమెన్, భారత జలశక్తి మంత్రిత్వ శాఖ గణాంకాల సహితంగా నమోదు చేసిన వాస్తవం ఇదే. నీటి భద్రతే లింగ సమానత్వానికి భూమిక. ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా మార్చి 22న 'ప్రపంచ నీటి దినోత్సవం' నిర్వహిస్తూ మనలో నీటి చైతన్యాన్ని పెంపొందించే ప్రయత్నం చేస్తోంది. ఈ ఏడాది ఇతివృత్తం: 'ప్రజలందరికీ నీరు: స్త్రీ పురుషులకు సమాన హక్కులు-- సమాన అవకాశాలు'. నీటి దినోత్సవ ప్రచార నినాదం: 'నీరు ప్రవహించే చోట, లింగ సమానత్వం వికసిస్తుంది'! అది సాగు నీరైనా, తాగు నీరైనా సరే.. నీటికి సంబంధించి ఎటువంటి నిర్ణయాలు తీసుకునే సందర్భంలో అయినా మహిళల అభిప్రాయాలకు, ఆకాంక్షలకు సముచితమైన చోటివ్వటం ద్వారా సమానత్వాన్ని వికసింపజేయాలని ఐరాస పిలుపునిస్తోంది! ఇది మనందరం ఆలకించాల్సిన మానవీయమైన పిలుపు!! వ్యవసాయానికి అవసరమైన శ్రమను, గృహ, ఉత్పాదక అవసరాలకు నీటిని అందించడంలో మహిళలే ప్రధాన పాత్ర పోషిస్తున్నప్పటికీ.. అధికారిక నీటి నిర్వహణ, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియల నుంచి వారిని క్రమపద్ధతిలో మినహాయిస్తున్నారు. వ్యవసాయ పనులను 37%-42% వరకు మహిళలే చేస్తున్నారు. ఒక పంట కాలంలో సగటున 3,300 గంటలు పనిచేస్తారు. పురుషుల 1,860 గంటలు మాత్రమే. కలుపు తీయటం, మొక్కలు నాటటం, నీరు పెట్టటం వంటి చేతులతో చేసే పనులు, ఎక్కువ నీరు అవసరమయ్యే పనులతో ?టు, పశువులకు నీరు పెట్టటం వంటి పశు?ోషణ పనుల్లో ఎక్కువ భాగాన్ని చక్కబెట్టే బాధ్యతలను మహిళలు నెరవేర్చుతున్నారు. క్షేత్ర స్థాయిలో వీరే 'వాస్తవ' నీటి నిర్వాహకులు అయినప్పటికీ, వారి ?త్రను తక్కువగా చూస్తున్నారు.

## టైమ్ పావర్టీ

భూగర్భ జలమట్టాలు తగ్గి?తున్నందున, మహిళలు నీటిని తెచ్చుకోవడానికి మరింత దూరం ప్రయాణించవలసి వస్తుంది. మన దేశంలో మహిళలు కొన్నిసార్లు దీనికోసం రోజూ నాలుగు గంటల వరకు సమయం వెచ్చిస్తున్నారు. బుందేల్‌ఖండ్, విదర్భ, రాయలసీమ వంటి కరువు పీడిత ప్రాంతాల్లో వేసవికాలంలో 15--20 లీటర్ల బిందెలను నెత్తిన పెట్టుకని రోజుకు 5--20 కిలోమీటర్ల దూరం నడచి మరీ కుటుంబాలకు మహిళలు, బాలికలు నీటిని సమకూర్చుతున్నారు. ఒక అంచనా ప్రకారం.. గ్రామీణ భారతీయ మహిళ నీటి సేకరణ కోసం 210 గంటల (27 పూర్తి పనిదినాలకు సరిపడా) సమయాన్ని ప్రతి ఏటా కేటాయిస్తోంది. ఇంట దగ్గరకే కుళాయి వస్తే ఈ సమయం అంతా మహిళలకు ఆదా అవుతుంది. ఈ శ్రమకు విలువ కడితే దేశం యావత్తూ ఒక రోజు ఆర్జించే ఆదాయానికి సమానం. ఈ పనుల వల్ల మహిళలు, బాలికలకు తీరిక దొరక్క (టైమ్ పావర్టీ) చదువు లేదా మరింత లాభదాయకమైన వ్యవసాయ కార్యకలాపాల్లో పాల్గొనలేకపోతున్నారు. కేవలం 5% మంది మహిళలకు మాత్రమే కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నాయి. సోలార్ పంపులు వంటి వాతావరణ మార్పుల్ని తట్టుకునే టెక్నాలజీలు అందుబాటులో లేవు. అందు వల్ల, మహిళా రైతులు ఎక్కువగా కరువు బాధితులుగా మారుతున్నారు. వాతావరణ మార్పులను తట్టుకోగల సేంద్రియ వ్యవసాయ నమూనాలకు మహిళా రైతులు పెద్దపీట వేస్తున్నారు. చిరుధాన్యాలను పండించటం, ఆహారంలో భాగం చేసుకోవటంలోనూ మహిళా రైతులు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్నారు. ఇవన్నీ ఆహార భద్రతను పెంచుతాయని, నీటి వినియోగాన్ని తగ్గిస్తాయని అనేక సంస్థల అనుభవాలు నిరూపించాయి. పురుషులతో పోలిస్తే మహిళలు వాతావరణ మార్పుల పట్ల ఎక్కువ సున్నితంగా ఉంటారని చటర్జీ (2021) అధ్యయనంలో వెల్లడైంది. నీటి లభ్యత, వ్యవసాయ ఉత్పాదకత, పశువుల సమస్యలు వంటి వివిధ రంగాలలో పురుషుల కంటే మహిళలే వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎక్కువగా గమనిస్తారని కూడా అధ్యయనాలు ఎత్తి చూపుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం, దేశం మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో 55%--65% వాటా మహిళా రైతులదే. పురుష రైతులు వ్యవసాయ రంగాన్ని విడిచిపెట్టి, వ్యవసాయేతర రంగాలలో కూలీలుగా మారుతున్న ప్రస్తుత ధోరణిని బట్టి చూస్తే, భారతదేశంలో మహిళా రైతుల సంఖ్య పెరుగుతోంది.

## లింగ సమానత్వానికి అడ్డంకులు

మన దేశంలో నీటి హక్కులు సాధారణంగా భూ యాజమాన్యంతో ముడిపడి ఉంటాయి. సాగులో ఉన్న భూముల్లో కేవలం 13.5% మాత్రమే మహిళల ఆధీనంలో ఉన్నాయి. అధికారిక నీటి వినియోగదారుల సంఘాలు, సాగునీటి హక్కుల విషయంలో నిర్ణయాలు తీసుకోవటంలో మహిళల పాత్ర అంతంత మాత్రంగా మిగిలిపోయింది. సమావేశాలకు హాజరు కావడానికి భర్త అనుమతి అవసరం కావడం, వ్యక్తిగతంగా ఆత్మవిశ్వాసం లేకపోవడం, 'నీటిపారుదల పురుషుల పని' అనే భావన వంటివి నీటి నిర్వహణలో లింగ సమానత్వానికి అడ్డంకులుగా నిలుస్తున్నాయి. 2012లో ప్రభుత్వం ప్రకటించిన జాతీయ జల విధానం మహిళల అవసరాలను ప్రస్తావించింది. అయినప్పటికీ, జల పరిపాలనలో పురుషులతో సమానంగా మహిళలకు నిజంగా అవకాశాలు కల్పించడానికి ఇందులో నిర్దిష్ట మార్గదర్శకాలు లేవని విమర్శకులు వాదిస్తున్నారు.

## మహిళల మహా శ్రమ

ప్రతి రోజూ 20 కోట్ల మంది భారతీయులు నడిచి వెళ్లి దూరం నుంచి నీటిని తెచ్చుకుంటారు. వీరిలో అత్యధికులు మహిళలు, బాలికలు (భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ). భారతదేశ జనాభాలో దాదాపు సగం మంది, అంటే 60 కోట్ల మంది, తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నారు (నీతి ఆయోగ్ సీడబ్ల్యూఎంఐ 2018). ప్రభుత్వం అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ ఫలితంగా ప్రతిరోజూ మహిళలు నీటిని తెచ్చేందుకు ఖర్చు చేసే 5.5 కోట్ల గంటల సమయం ఆదా అవుతోంది (జల్ శక్తి మంత్రిత్వ శాఖ, 2023). ప్రపంచవ్యాప్తంగా మహిళలు, బాలికలు ప్రతిరోజూ నీటి సేకరణకు 25 కోట్ల గంటలు వెచ్చిస్తున్నారు. ఇది పురుషులు, బాలుర కంటే 3 రెట్లు ఎక్కువ (యూఎన్ ఉమెన్, 2024). ప్రపంచవ్యాప్తంగా 100 కోట్లకు పైగా మహిళలు, అంటే మొత్తం మహిళల్లో 27 శాతానికి పైగా, సురక్షిత తాగునీటి సేవలను పొందలేకపోతున్నారు (యూఎన్ ఉమెన్/యూఎన్‌డిఈఎస్ఏ, 2023). సురక్షితమైన తాగునీరు అందక భారతదేశంలో ప్రతి సంవత్సరం 2 లక్షల మంది మరణిస్తున్నారు (నీతి ఆయోగ్ సీడబ్ల్యూఎంఐ). మన దేశంలోని నదులు, రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటిలో 70 శాతం కలుషితమైంది. జల నాణ్యత సూచికలో 122 దేశాల్లోకెల్లా భారతదేశం 120వ స్థానంలో, చివరి నుంచి మూడో స్థానంలో, ఉంది (నీతి ఆయోగ్ / ప్రపంచ బ్యాంకు). ప్రపంచవ్యాప్తంగా 14% దేశాల్లో నీటికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో పురుషులతో సమానంగా మహిళలు పాల్గొనడానికి ఇప్పటికీ ఎలాంటి యంత్రాంగాలు లేవు (యూఎఈ ఈపీ--డీహెచ్ఐ, జీడబ్ల్యూపీ, యూఎన్ ఉమెన్, 2025).

## నీటిపారుదల సామర్థ్యం

వ్యవసాయరంగంలో నీటిపారుదల సామర్థ్యం ప్రపంచ సగటు 50--60%. మన దేశ వ్యవసాయ నీటిపారుదల సామర్థ్యం కేవలం 38% మాత్రమేనని నీతి ఆయోగ్ స్పష్టం చేసింది. పంటలకు నీటి వినియోగ సామర్థ్యాన్ని 60%కి పెంచితే, ఏటా 200 బిలియన్ క్యూబిక్ మీటర్ల (బీసీఎం) పైగా నీరు అందుబాటులోకి వస్తుంది. ఇది గృహ, పారిశ్రామిక అవసరాల కొరత మొత్తాన్ని తీర్చడానికి సరి?ోతుందని నీతి ఆయోగ్ అంచనా. సమానమైన దిగుబడి కోసం అమెరికా, చైనా లేదా ఇజ్రాయెల్‌లోని రైతులతో ?ోలిస్తే భారతీయ రైతులు (ఒక్కో పంట యూనిట్‌కు) 3--5 రెట్లు ఎక్కువ నీటిని ఉపయోగిస్తున్నారు. ఇది రైతుల వైఫల్యం కాదు. ఇది విధానపరమైన మౌలిక సదుపాయాల వైఫల్యమని నీతి ఆయోగ్ / ఎఫ్ఏఓ తేటతెల్లం చేశాయి. ప్రపంచంలోనే అత్యధికంగా భూగర్భ జలాలను తోడే దేశం భారతదేశం. ఏటా 239--241 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని తోడేస్తున్నాం. ఇది ప్రపంచవ్యాప్తంగా తోడుతున్న నీటిలో నాలుగో వంతు కంటే ఎక్కువ. 1,592 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని అధికంగా వినియోగిస్తున్నామని అంచనా. భారతదేశంలోని నదులు, చెరువులు, రిజర్వాయర్లు, కాలువల్లోని 70% నీరు కలుషితమయ్యాయి. జల నాణ్యత సూచికలో 122 దేశాలలో భారతదేశం 120వ స్థానంలో ఉంది. మనం కేవలం నీటిని కోల్పోవడమే కాదు, మిగిలి ఉన్న నీటిని కూడా విషపూరితం చేస్తున్నామని నీతి ఆయోగ్/ప్రపంచ బ్యాంకు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

## మహిళలకే గ్రామస్థాయి జల నాయకత్వం

నీటి సేకరణకు అనుదినం మహిళలు, బాలికలు వెచ్చించే సమయం నుంచి ఆదా చేసే ప్రతి గంట సమయమూ.. మహిళాభివృద్ధిలో, విద్యలో, వాణిజ్యంలో, సమాజ పరివర్తనలో పెట్టుబడిగా పెట్టడానికి అదనంగా దొరికిన సమయమే. నీటి భద్రత, లింగ సమానత్వం అనేవి వేర్వేరు అంశాలు కావు. నీటి భద్రతతోనే లింగ సమానత్వం సాధ్యం. ఒకే సంక్షోభం, ఒకే అవకాశం. జల్ జీవన్ మిషన్ సహా ప్రభుత్వ నీటి పథకాలన్నిటికి సంబంధించి గ్రామ స్థాయిలో మహిళలను ప్రాథమిక జల పరిపాలన నాయకులు'గా అధికారికంగా గుర్తించాలి. నీటిని పరిపాలన బాధ్యతలు మహిళలకిస్తే సమాజాలు అభివృద్ధి చెందుతాయని గణాంకాలు స్పష్టంగా చెబుతున్నాయి. 5, 6 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, విక్సిత్ భారత్ లక్ష్యం కూడా తద్వారా నెరవేరుతాయి.

## కంప్యూటర్లపై టాస్క్ లు తేలిగ్గా పరిష్కారం..
## ఏఐ చాట్ బోట్ స్థానే ఏఐ ఏజెంట్స్..
## త్వరలో ఆవిష్కరించనున్న ఓపెన్ ఏఐ




టెక్నాలజీ రంగంలో పలు మార్పులు తెచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) క్షణాల్లో జవాబులిస్తూ యూజర్లను ఆశ్చర్య చకితుల్ని చేస్తున్నది. ఓపెన్ ఏఐ అనే స్టార్టప్ సంస్థతోపాటు పలు సంస్థలు తెచ్చిన చాట్‌బోట్‌లు సంచలనం సృష్టించాయి. మరింత మెరుగ్గా ఈ సేవలు అందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లు అందుబాటులోకి వస్తున్నాయి. చాట్‌జీపీటీ సృష్టికర్త ఓపెన్ ఏఐ ఈ 'ఏఐ ఏజెంట్ల'ను పరిచయం చేసేందుకు రెడీ అవుతున్నదని వార్తలొస్తున్నాయి. ఈ 'ఏఐ ఏజెంట్ల' రాకతో మన పనులు మరింత సులభమయ్యే అవకాశాలు ఉన్నాయి. కంప్యూటర్ సిస్టమ్ లోని టాస్క్‌లు వేగంగా పూర్తి చేయడానికి త్వరితగతిన ఏఐ ఏజెంట్లు అందుబాటులోకి తేవడానికి ఓపెన్ ఏఐ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం పలు రీసెర్చ్ ప్రాజెక్టులపై పని చేస్తున్నట్లు సమాచారం. డెవలపర్లకు రీసెర్చ్ ప్రీవ్యూగా ఏఐ ఏజెంట్లను ఓపెన్ ఏఐ వచ్చే జనవరికల్లా



అందుబాటులోకి తేనున్నది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తర్వాత ఎక్కువగా ఏఐ ఏజెంట్స్ పేరు వినిపిస్తోంది. ఏఐ చాట్ బోట్ వంటివే ఏఐ ఏజెంట్స్ అనే భావన చాలా మందిలో ఉంది కానీ.. ఏఐ చాట్ బోట్స్.. ఏఐ ఏజెంట్స్ విభిన్నం. ఏఐ చాట్ బోట్ కేవలం యూజర్ల ప్రశ్నలకే స్పందిస్తుంది తప్ప.. తన పరిధి దాటి ముందుకెళ్లలేదు. కానీ ఏఐ ఏజెంట్ ప్రశ్నల ఉద్దేశం.. సందర్భాన్ని అర్థం చేసుకుని స్వేచ్ఛగా ఆలోచించి, నిర్ణయాలు తీసుకునే యంత్రాంగం సాయంతో మెరుగ్గా ప్రతిస్పందిస్తుంది. కంప్యూటర్లలో పనులు పూర్తి చేయగల ఏఐ ఏజెంట్లను ఓపెన్ ఏఐ అభివృద్ధి చేసిందని సమాచారం. ఏఐ ఏజెంట్లు కోట్ రాసి, టికెట్ బుకింగ్ వంటి క్లిష్టమైన పనులు తేలిగ్గా పూర్తి చేస్తాయని చెబుతున్నారు. వచ్చే ఏడాది ఏఐ ఏజెంట్లను అందుబాటులోకి తెస్తామని ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ ఇటీవల చెప్పారు.

# పరిశ్రమలు వెనకడుగు..
# ఒప్పందాలకే పరిమితమైన పెట్టుబడులు

### పదేండ్లపాటు పారిశ్రామిక రంగం పరుగులు
### కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఏడాదిగా స్తబ్ధత
### ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్తున్న పరిశ్రమలు
### బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసిన వివాదాలు

హైదరాబాద్,- ఏడాది కిందటి వరకు.. తెలంగాణ అంటే పెట్టుబడుల గమ్యస్థానం. ఇండస్ట్రీ ఫ్రెండ్లీ విధానాలతో పారిశ్రామికవేత్తలను ఆకర్షించిన రాష్ట్రం. పదేండ్లలోనే రూ. 2.66లక్షల కోట్ల పెట్టుబడులు సాధించి, దాదాపు 18లక్షల ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం. కానీ.. ఏడాదిలోనే సీన్ రివర్స్ అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాల ఫలితంగా కొత్త కంపెనీలు రాకపోగా.. గతంలో వచ్చిన పెట్టుబడులు సైతం పక్క రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయి. పరిశ్రమలకులో ఓల్టేజీ, కరంటు కోతలు మొదలయ్యాయి. వరుస వివాదాలు రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశాయి.



### పరిశ్రమలు వెనక్కి.. ఫార్మా.. ఆగమాగం

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సంవత్సర కాలంలో ఒక్క భారీ పరిశ్రమ కూడా రాలేదు. పైగా రెండు భారీ పరిశ్రమలు వెనక్కు తరలివెళ్లాయి. గొరిల్లా గ్లాస్ తయారీ కంపెనీ కార్నింగ్ రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి పెట్టేందుకు బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. కంపెనీ ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ఇప్పుడు చెన్నైకి తరలివెళ్లింది. సెమీ కండక్టర్ల తయారీ దిగ్గజం కేన్స్ సెమికాన్ కంపెనీది ఇదే పరిస్థితి. రాష్ట్రంలో రూ.2,800 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. కానీ.. ఇప్పుడు గుజరాత్ బాట పట్టింది. అనేక చిన్న కంపెనీలు తమ యూనిట్లను మూసివేసేందుకు సిద్ధం అవుతున్నాయన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఫార్మా రంగం అగమ్యగోచరంగా తయారైంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ముచ్చర్లలో దాదాపు 14వేల ఎకరాలతో ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో కంపెనీల విస్తరణ ప్రణాళికలు వాయిదా పడ్డాయి. కొన్ని కంపెనీలు ఏపీ, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు తరలివెళ్లాయి. దీంతో ఫార్మా క్లస్టర్లు, ఫార్మా విలేజీలను తెరమీదికి తెచ్చారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో భూసేకరణకు ప్రయత్నిస్తే జరిగిన పరిణామాలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. దీంతో ఫార్మా కంపెనీలు తెలంగాణ అంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి తలెత్తింది.

### బ్రాండ్ ఇమేజ్ డ్యామేజ్

బీఆర్ఎస్ హయాంలో దేశ, విదేశాల్లో తెలంగాణకు కల్పించిన ప్రచారంతో బ్రాండ్ ఇమేజ్ పెరిగింది. కానీ ఏడాదిగా జరుగుతున్న పరిణామాలు ఈ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయి. ఫార్మాసిటీ రద్దుతో మొదలవగా.. ఫార్మా క్లస్టర్ల పేరుతో లగచర్లలో జరిగిన హింసాత్మక ఘటనలతో వ్యాపారవేత్తలు ఆలోచనలో పడ్డారు. సీఎం అమెరికా పర్యటన సందర్భంగా సొంత తమ్ముడికి చెందిన స్వచ్ఛ్ బయోగ్రీన్‌తో ఒప్పందం మరింత పరువు తీసింది.

### 40,232 కోట్ల ఒప్పందాలు

ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ వాణిజ్య వేదిక వార్షిక సదస్సు సందర్భంగా రూ. రూ.40,232 కోట్లు పెట్టుబడి ఒప్పందాలు జరిగినట్టు ప్రభుత్వం ఘనంగా ప్రకటించుకున్నది.

### 1 ఒక్క కంపెనీ తెలంగాణకు రాలేదు

ఆగస్టులో సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన సందర్భంగా రూ.36వేల కోట్లకు ఎంవోయూలు కుదుర్చుకున్నట్టు చెప్పుకున్నారు. కానీ ఈ రూ.76వేల కోట్లలో ఒక్క కంపెనీ కూడా కాగితాలను దాటలేదు.

### 10%హైదరాబాద్‌లో కంపెనీలనమోదు డౌన్

2023 జూలై-సెప్టెంబర్ త్రైమాసికంతో పోల్చుకుంటే 2024 జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో హైదరాబాద్‌లో కంపెనీల నమోదు 10 శాతం తగ్గినట్టు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. కంపెనీల నమోదు ఐదేండ్ల కనిష్టస్థాయికి పడిపోయినట్లు స్పష్టం చేసింది.

# భువి నుంచి దివికి.. భూటాన్!



'సంవత్సరానికోసారి భూటాన్ వెళ్లగలిగిన వారు ఈ భూమ్మీద అదృష్టవంతులు' అంటారు ఓల్గా. ఆ అదృష్టాన్ని వెతుక్కుంటూ ముప్పై నుంచి అరవై అయిదేళ్ల వయసున్న మరో పదకొండుమంది మహిళలతో కలిసి వారంరోజుల భూటాన్ యాత్రకు బయల్దేరాను. హైదరాబాద్‌లో ఫ్లయిట్ ఎక్కి, రెండున్నర గంటల తర్వాత వెస్ట్ బెంగాల్‌లోని 'బాగ్ డోగ్రా'లో దిగి.. జీప్‌లో మూడు గంటలు ప్రయాణించాక.. ఇండియా



- భూటాన్ సరిహద్దు చేరుకున్నాం. రెండుదేశాలను వేరుచేసే విభజన రేఖను చూడటం నాకిదే మొదటిసారి. నేను నిల్చున్న ఆ రెండడుగుల నేలకు.. ప్రపంచంలోనే అత్యధిక జనసాంద్రత కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం ఒకవైపు - ప్రపంచంలోనే అతి తక్కువ జనసాంద్రత కలిగిన ఆకలీ అలజడులూ లేని చిన్నదేశం మరో వైపు ఉన్నాయన్న ఆలోచనే నాలో భావోద్వేగాన్ని కలిగించింది. బోర్డర్ మీదే 'ఆన్-అరైవల్ వీసా' తీసుకుని, ఎదురుగుండా ఉన్న పక్క దేశపు హోటల్‌కు చేరుకున్నాం. అక్కడే భోజనం చేసి నిద్రపోయాం.

### థింపూ యాత్ర

ఉదయాన్నే మా బస్ డ్రైవర్ 'సంగీ వాంగీ', టూర్ గైడ్ 'నోర్బూ' మమ్మల్ని 'కుజూ జంపోలా' (గుడ్ మార్నింగ్) అని పలకరించాక.. అందరం మినీ బస్‌లో భూటాన్ రాజధాని థింపూ బయల్దేరాం. మామూలుగా బోర్డర్ నుంచి థింపూ వెళ్లడానికి అయిదు గంటలు చాలు. కానీ, ముందురోజు వర్షానికి కొండరాళ్లు దొర్లడంతో మా ప్రయాణం మందకొడిగా సాగింది. కనుచూపుమేరా దూది పింజల్లా మేఘాలు. నిటారుగా ఆకాశాన్నంటుతున్న పొడవైన చెట్లు. నల్లటి పాము మెలికల్లాంటి తారురోడ్డు. ప్రయాణం నయన ప్రియం అయినపుడు.. కాళ్లు మాత్రం కుదురుగా ఉంటాయా! అరవైలలో ఉన్నవాళ్లు కూడా ఇరవైలలోకి దూకేశారు. పాటలు, డ్యాన్సులు, నవ్వులు, కేరింతలు. వాంగ్ వేసిన సడన్ బ్రేక్‌తో ఈలోకంలోకి వచ్చిపడ్డాం. 'ఏంటా!?' అని దిగి చూస్తే.. రోడ్డుకు అడ్డంగా పెద్దపెద్ద బండరాళ్లు. రోడ్డు 'సాఫ్' చేయడానికి చాలా టైమ్ పడుతుందన్నారు. రూటు మార్చి, బస్సు థింపూ చేరేసరికి ఇంకో రెండుగంటలు ఎక్కువ పట్టింది. అలా మొదటిరోజు మొత్తం ఒక 'రోడ్ ట్రిప్'లా ముగిసిపోయింది.

### చలో డోర్ డెన్మా..

రెండోరోజు ఉదయమే థింపూకి దక్షిణం వైపు ఉన్న బుద్ధుడి విగ్రహం 'డోర్ డెన్మా' చేరుకున్నాం. 169 అడుగుల ఎత్తుతో బంగారు పూతతో ఉన్న భారీ కంచు విగ్రహం అది. మేఘావృతమైన ఎత్తయిన కొండల మధ్య నీరెండ తాకిడికి పసిడికాంతులతో మెరిసిపోతున్న బుద్ధుణ్ని చూడటానికి రెండు కళ్లు చాలలేదు. పాలనురగలాంటి మేఘాలు బుద్ధుణ్ని ఆలింగనం చేసుకోవడానికి చేతులు చాపుతున్నాయా? లేక ఆ బుద్ధుడే మేఘాల్లోకి చొచ్చుకుపోతున్నాడా!? అన్నట్టున్న ఆ తథాగతుడి రూపాన్ని చూసి తరించడమే తప్ప.. వర్ణించనలవి కాదు. అసంకల్పితంగా వజ్రాసనం వేసుకుని కాసేపు ధ్యానముద్రలోకి వెళ్లి పరిసరాల్ని మర్చిపోయాను. ఎవరో తట్టి లేపితే అక్కణ్నుంచి మెట్లెక్కి లోపలికి వెళ్లాను. మిరుమిట్లు గొలిపే బంగారుపూతతో చేసిన.. లక్షకు పైగా ఉన్న బుద్ధుడి మినియేచర్ విగ్రహాలను చూసేసరికి మతిపోయింది.



అక్కణ్నుంచి దగ్గర్లోనే జరుగుతున్న థింపూ శెచు పండుగ సంబురాన్ని చూడటానికి వెళ్లాం. ప్రతి సంవత్సరం సెప్టెంబర్, అక్టోబర్‌లో మూడురోజుల పాటు జరిగే అతిపెద్ద ఉత్సవం అది. మేం వెళ్లిన తేదీల్లో ఆ వేడుక రావడం.. నిజంగా మా అదృష్టమే! బౌద్ధ సన్యాసుల ప్రార్థనలు, నృత్య ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణ. పసిపిల్లల నుంచి పండుముసలి వరకు.. వేలాదిమంది రంగురంగుల సంప్రదాయ దుస్తుల్లో, పుష్పాలంకరణలతో ఆడుతూ పాడుతూ ఉంటే.. పూలసింగిడి నేల మీదికి దిగి నాట్యం చేస్తున్నట్టుగా అనిపించింది. ఇంతలో సన్నని తుంపర్లతో కూడిన జల్లు మొదలయింది. అన్ని వేలమంది ఉన్నా కూడా ఎక్కడా గోల, తోపులాట లేకుండా క్రమశిక్షణతో ఉండటం చూసి ఆశ్చర్యపోయాను.



### 'సింప్లీ' సూపర్బ్

అక్కణ్నుంచి సింప్లీ భూటాన్ మ్యూజియం చేరుకున్నాం. లోపల చుట్టూ గుడిసెలాంటి దాంట్లో మమ్మల్ని కూర్చోబెట్టి చిన్నకప్పుల్లో సంప్రదాయ వైన్ సర్వ్ చేశారు. మ్యూజియంలో ఒక్కో అర దాటుతుంటే.. అక్కడి గ్రామీణ జీవన విధానం, వంటగది సామాన్లు, ఆహారపు అలవాట్ల గురించి వివరించాడు నోర్బూ. తర్వాత మాకు అల్పాహారం వడ్డించి, సంప్రదాయ నృత్యాన్ని ఏర్పాటుచేశారు. కాసేపయ్యాక మేం కూడా వారితో జతకలిసి చిందులు వేశాం. మా తర్వాతి డెస్టినేషన్.. పునాఖా. రెండుగంటల ప్రయాణం. "పదినిమిషాలు నడవగలిగిన వాళ్లు రండి, సస్పెన్షన్ బ్రిడ్జ్ చూడొచ్చు" అని చెప్పాడు నోర్బు. ఓ కిలోమీటర్ నడిచి రంగు రంగుల జెండాలు కట్టిన సన్నటి పొడవైన సస్పెన్షన్ బ్రిడ్జ్ దగ్గరికి చేరుకున్నాం. ఉక్కు, చెక్క పలకలతో నిర్మితమైన ఆ వంతెన ఎక్కగానే ఒకలాంటి స్ప్రింగ్ మూమెంట్‌తో భలే థ్రిల్లింగ్‌గా అనిపించింది. ఈ వంతెన కిందుగా పారే నది పేరు.. పోచు. దీన్ని తండ్రి నది అనీ, మరొకచోట పారే మోచు (భూటాన్‌లోని అతి పెద్ద నది)ని 'తల్లి నది' అని అంటారట. ఈ పోచు-మోచుల సంగమ నది.. 'పునా సంగ్ చూ' కూడా చూశాం. అక్కడ బస్సెక్కగానే "ఇప్పుడు మిమ్మల్ని ఒక అద్భుతమైన చోటికి తీసుకెళు_న్నాం. అక్కణ్నుంచి మీకు కదలాలని కూడా అనిపించదు" అని ఊరించసాగాడు నోర్బూ. అదేంటా అన్న ఎక్జయిట్మెంట్‌లో ఉండగానే బస్సు ఆగింది. పొలోమంటూ దిగి తలోదిక్కూ పోయాం. 'డోచులా' అనే పర్వత మార్గంలో మంచు ఆవరించిన నూట ఎనిమిది 'స్మారక స్థూపాల' వరుస ఎంతో మనోహరంగా కనిపించింది. వాటి మీదున్న రంగురంగుల కళాత్మక నిర్మాణాల నుంచి కన్ను తిప్పుకోవడం అసాధ్యం. ఇది థింపూ-పునాఖా రహదారిపై ఉంది. ఇక్కడే బొటానికల్ పార్క్, లఖాంగ్ అనే మోనాస్ట్రీ కూడా చూశాం.



### అదిగదిగో.. హిమాలయం

అక్కణ్నుంచి వెనుదిరిగి, ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని చూసి నా మనసు, కళ్లూ పారాచూట్‌లాగా విచ్చు కున్నాయి. ఆకుపచ్చ, నీలి, తెలుపు రంగుల్లో తైలవర్ణ చిత్రరాజంలా కనిపించాయి హిమాలయాలు. చిన్నప్పటి నుంచి వాటి గురించి గొప్పగా చదివీ చదివీ, వినీవినీ ఎప్పుడెప్పుడు చూస్తానా!? అని ఉవ్విళ్లూరిన 'ది గ్రేట్ హిమాలయాస్' ఒక్కసారిగా కళ్లెదుట కనిపించేసరికి నా గుండె లయ తప్పింది. ఎదురుగా ఉన్న మెట్లమీద కూర్చుని వాటి అందాలను చూస్తూ ఎంతసేపు గడిపానో? పాలనురుగు, లేత, ముదురు నీలి రంగుల టైఅండ్‌డై చీరలా, జలతారు పరదాల్లాగా పరుచుకుని గాలికి రెపరెపలాడుతున్నట్టు కనిపించే ఆ హిమవన్నగాన్ని ఏకాంతంగా చూస్తుంటే ఏదో తెలియని అవ్యక్తాను భూతి, దగ్గరితనం, ఇంకేదో గుబులు. ఆ ఫీలింగ్ మాటల్లో చెప్పలేం. ఆ భారమైన క్షణాలను వదిలి రావడం అంత తేలికేం కాదు. తరువాతి రోజు 'పారో' సిటీకి బయల్దేరాం. దారిలో రోడ్డుకు ఇరువైపులా అమ్ముతున్న కూరగాయలను ఆసక్తిగా చూస్తూ, మక్క కంకులను కొనుక్కుని తింటూ పునాఖా జాంగ్ దగ్గర కాసేపు ఆగి, భూటానీయుల సంప్రదాయ దుస్తులను అద్దెకు తీసుకుని.. వేసుకుని.. ఫొటోలు దిగాం. దగ్గర్లో ఉన్న రెండు 'బౌద్ధ మొనాస్ట్రీ'లను దర్శించుకున్నాం. మా చివరి పాయింట్ 'టైగర్స్ నెస్ట్'. పారో వ్యాలీకి ఎదురుగా ఉన్న క్లిఫ్ సైడ్‌లోని మఠం. ఇదే బౌద్ధుల పరమ పవిత్ర దేవాలయం. వెయ్యి రూపాయలు ఎంట్రీ ఫీజు. లోపల 'బౌద్ధ దేవత' కొలువై ఉంటుంది. ఈ దేవతే భూటాన్‌కు బౌద్ధాన్ని పరిచయం చేసిందని అంటారు. ఆరో రోజు ఓ ఇంట్లో భూటాన్ సంప్రదాయ వంటకాలను రుచి చూశాం. ఇంట్లోకి వెళ్లగానే ఒక అందమైన స్త్రీ చిరునవ్వుతో వెల్‌కమ్ డ్రింక్ ఇచ్చింది. భూటాన్‌లో మొదటిసారి ఆరోగ్యకరమైన వెజ్, నాన్ వెజ్ వంటకాలతో కూడిన



'స్థానిక భోజనం' చేశాం. చివరిగా పెరట్లో కాసిన ఆపిల్‌కాయల ముక్కలు తిని, స్వచ్ఛమైన గాలిని హృదయం నిండుగా పీల్చుకుని.. ఆమెకు కృతజ్ఞతలు చెప్పుకొని బయటికి వచ్చాం. అప్పుడు చెప్పాడు నోర్బు మాకు.. ఆమె అతని భార్య అని, అది అతని ఇల్లే అని. "ముందు ఎందుకు చెప్పలేదు!?" అంటే.. "మీరు భోజనం ఎలా ఉందో చెప్పాక చెబుదామనుకున్నా!" అని చెణికాడు. "భూటాన్ అందమైన దేశం, ఆనందకరమైన దేశం అంటున్నారు కదా.. ఎప్పుడూ ఇలాగే ఉంటుందా!?" అన్న నా ప్రశ్నకు నోర్బు జవాబు.."ఒకప్పుడు ప్రపంచానికి దూరంగా ఉన్నాం. ఈ మధ్యనే తలుపులు తెరిచి పర్యాటక దేశంగా మారాం. కానీ, ఈ మధ్య వెలుస్తున్న కొత్త కట్టడాలు, నిర్మాణాలు, పర్యాటకుల సందడి చూస్తుంటే.. మాకూ కొంత ఆదుర్దాగానే ఉంది. ఏం అభివృద్ధి జరుగుతుందో, ఎంత విధ్వంసం అవుతుందో!" అతని స్వరంలోని సన్నని విషాద జీర అర్థమై, ఏం మాట్లాడాలో తెలీక మౌనాన్ని ఆశ్రయించి.. అతనికి 'కద్రిన్ చేలా (వీడ్కోలు)' చెప్పి.. దివి నుంచి భువికి తిరుగు ప్రయాణం అయ్యాం.

## మరోసారి చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైన ఇస్రో..
## 4న ప్రోబా-3 మిషన్ ప్రయోగం..!




భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ మరోసారి చరిత్ర సృష్టించేందుకు రెడీ అయ్యింది. భానుడి రహస్యాలను ఛేదించేందుకు సిద్ధమైంది. గతంలో ఆదిత్య ఎల్-1 మిషన్‌ను చేపట్టిన ఇస్రో తాజాగా.. ప్రోబా-3 మిషన్ ప్రయోగించబోతున్నది. వివిధ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో భాగస్వాములయ్యారు. మిషన్ ప్రయోగం బాధ్యతలను ఇస్రో తీసుకుంటుండగా.. శాటిలైట్‌ను నింగిలోకి ఇస్రో విజయవంతమైన రాకెట్ పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ తీసుకెళ్లనున్నది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రోబా-3 మిషన్‌ను డిసెంబర్ 4న ఏపీలోని శ్రీహరికోట స్పేస్‌పోర్ట్ నుంచి ప్రయోగించనున్నట్లు ఇస్రో వెల్లడించింది. ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ సహకారంతో ప్రోబా-3ని ప్రయోగించబోతున్నారు. బుధవారం సాయంత్రం 4:08 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనున్నది. మిషన్‌లో భాగంగా 550 కిలోల బరువున్న ఉపగ్రహాలను ప్రత్యేకమైన దీర్ఘవృత్తాకార కక్ష్యలో ఉంచనున్నట్లు ఇస్రో పేర్కొంది. ఇది సంక్లిష్ట కక్ష్యలోకి ఖచ్చితత్వంతో ప్రయోగం నిర్వహించేందుకు విశ్వసనీయతను పీఎస్ఎల్‌వీ బలోపేతం చేస్తుందని పేర్కొంది. మిషన్‌లో భాగంగా యూరోపియన్ ఏజెన్సీ సూర్యుడి వాతావరణంలోని బయటి, అత్యంత వేడిపొర అయిన సోలార్ కరోనాను అధ్యయనం చేయనున్నది. ప్రోబా-3 మిషన్‌లో ప్రయోగించిన ఉపగ్రహాలు కృత్రిమ సూర్యగ్రహణ పరిస్థితులను సృష్టిస్తాయి. తద్వారా సూర్యుడి బయటి పొర అంటే.. కరోనాను అధ్యయనం చేస్తాయి. ఈ జంట ఉపగ్రహాల్లో ఒక దాంట్లో కరోనాగ్రాఫ్ ఉంటుంది. మరొకటి ఆల్టరర్ కలిగి ఉంటుంది. ఈ ఉపగ్రహాలలో ఒకటి సూర్యుడిని కనిపించకుండా కృత్రిమ గ్రహణం పరిస్థితి సృష్టిస్తే.. మరొకటి కరోనాను నిశితంగా గమనిస్తూ వస్తుంది. ప్రోబా-3 మిషన్ స్పెయిన్, పోలాండ్, బెల్జియం, ఇటలీ, స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తల కృషి ఫలితం. మిషన్‌లో రెండు ఉపగ్రహాలను ఒకేసారి ప్రయోగించబోతున్నారు. ఈ రెండేళ్ల సుదీర్ఘ మిషన్ ఎంతో ప్రత్యేకత ఉంది. ఈ ఉపగ్రహాలు నిర్ణీత కక్ష్యలోకి చేరుకోవడం కీలకం. ఎందుకంటే ఒకదానితో మరొకటి సమన్వయం చేసుకుంటూ కరోనాపై అధ్యయనం చేస్తాయి. ఇందులో ఏ ఒక్కటి పని చేయకపోయినా రెండో శాటిలైట్‌కు ఉపయోగం లేకుండాపోతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

# చావు ఏ రోజో చెప్పే ఏఐ!



టెక్నాలజీ దాదాపు అన్ని రంగాల్లో విస్తరిస్తోంది. కృత్రిమమేధ పరిధి పెరుగుతోంది. కిచెన్‌లో రిఫ్రిజిరేటర్, టీవీ, మొబైల్ ఫోన్, ఫ్యాన్.. వంటి అన్ని విభాగాల్లోకి ఏఐ ప్రవేశించింది. సమీప భవిష్యత్తులో మనిషిని ప్రత్యక్షంగా, పరోక్షంగా శాసించే స్థాయికి ఏఐ వెళ్లనుందనేది కఠోర సత్యం. దీని సాయంతో చాలా కంపెనీలు సమాచారాన్ని సేకరించి సులువుగా పని అయ్యేలా చూస్తున్నాయి. కొన్ని సంస్థలు మరింత విభిన్నంగా ఆలోచించి మనిషి మరణాన్ని అంచనా వేసేందుకు ఉపయోగిస్తున్నాయి. మనిషి జీవనశైలి, ఆహార అలవాట్లు, శారీరక శ్రమ, ఒత్తిడి.. వంటి వివరాలు అందించి మరణానికి మరెంత సమయం ఉందో తెలుసుకునేందుకు ఏఐ సాయం కోరుతున్నారు. ఈమేరకు మార్కెట్లో కొత్తగా యాప్‌లో వెలుస్తున్నాయి. వీటిపై వినియోగదారుల్లో ఆసక్తి నెలకొనడంతో వీటికి ఆదరణ పెరుగుతోంది.

### మరణ తేదీ అంచనా..

'డెత్ క్లాక్' అనే కృత్రిమ మేధ ఆధారిత యాప్ వినియోగదారుల జీవనశైలి, అలవాట్ల ఆధారంగా వారి ఆయుష్షును అంచనా వేయగల సామర్థ్యం కలిగి ఉంది. దీన్ని జులైలో ప్రారంభించినప్పటి నుంచి చాలామంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. బ్రెంట్ ఫ్రాన్సన్ అభివృద్ధి చేసిన ఈ యాప్ దాదాపు 1,200 కంటే ఎక్కువ అధ్యయనాలను విశ్లేషిస్తుంది. 5.3 కోట్ల మంది నుంచి సేకరించిన వివరాలను అధ్యయనం చేస్తుంది. వినియోగదారు తీసుకునే ఆహారం, చేసే వ్యాయామం, ఒత్తిడి స్థాయిలు, నిద్రపోయే విధానాలు.. వంటి విభిన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని మరణించే అవకాశం ఉన్న తేదీని అంచనా వేస్తుంది.

### సమయం వృథా చేయడం దేనికి..

మరణం ఎప్పుడైనా, ఎలాగైనా సంభవించవచ్చు. మన పరిధిలోలేని దాని గురించి ఆలోచించి సమయం వృథా చేయడం కంటే.. మరణం తథ్యం అనే వాస్తవాన్ని జీర్ణించుకుని జీవితంలో చేయాల్సిన కార్యాలు, మంచి పనులపై దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆకస్మాత్తుగా ఏదైనా జరిగి మరణిస్తే కుటుంబానికి ఆర్థికంగా భరోసానిచ్చే టర్మ్ పాలసీను తప్పకుండా తీసుకోవాలని చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ఆసుపత్రిపాలైతే ఆరోగ్యబీమా ఆదుకుంటుందని సూచిస్తున్నారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .